VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు ఒక అణా రిజిష్టరు నెం ▲ 193

మద్రాసు లుంగీలకు అమెరికాలో మంచి గిరాకీ

న్యూఢిల్లీ, మే 17

మద్రాసు లుంగీలకు అమెరికాలో మంచి గిరాకీ ఏర్పడిందని పరిశ్రమల మంత్రి శ్రీ నిత్యానంద కనుంగో నేడు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు. ఈ ఆసక్తి అలాగే వుండేట్లు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు.

విశాలాంధ్ర

30572/

సంపుటి 5 ★ విజయవాడ: శుక్రవారం మే 18, 1956 ★ సంచిక 35

రెండునెలల్లో అణు ఉత్పాదక యంత్రం పని ప్రారంభం

న్యూఢిల్లీ, మే 17

ప్రస్తుతం ట్రాంబాయి వద్ద నిర్మించబడుతున్న జలక్రీడాసరస్సు రూపంలో వుండే అణు ఉత్పాదక యంత్రం మరో రెండు నెలల్లో పని చేయడం ప్రారంభిస్తుందని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో చెప్పారు.

ప్రణాళికలోని భూసంస్కరణాల్లో అభివృద్ధినిరోధకమైన మార్పులు

ద్వితీయ ప్రణాళికలో కేంద్ర ప్రభుత్వం చేసిన సవరణలకు ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ నిరసన

◆ ◆ ◆

సత్వర భూసంస్కరణల్ని అభిలషించేవారంతా కలిసి ఐక్యఆందోళన సాగించాలని విజ్ఞప్తి

రాష్ట్రకాంగ్రెసు విశాఖ తీర్మానానికి హర్షం

విజయవాడ, మే 17

ప్లానింగ్ కమిషన్ యొక్క భూసంస్కరణల ఉపసంఘం చేసిన సూచనలను ద్వితీయ ప్రణాళికలో చేర్చాలని దేశంలోని అభివృద్ధికాముకులంతా ఒకవైపున ఆందోళన చేస్తూండగా మరోవైపున ప్రణాళిక ముసాయిదాలోని ప్రతిపాదనలనే అభివృద్ధినిరోధకంగా కేంద్ర ప్రభుత్వం మార్చడం అత్యంత గర్హనీయమని ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ కార్యవర్గం తీవ్రంగా నిరసిస్తూ నేడొక ప్రకటన చేసింది.

మన దేశంలో సత్వరంగా భూసంస్కరణలు అమలు జరపాలని కోరే పార్టీలు, గ్రూపులు, వ్యక్తులు ఐక్య ఆందోళన జరిపి భూసంస్కరణలను సాధించుకోవాలని కార్యవర్గం విజ్ఞప్తి చేసింది.

రాష్ట్రంలోని పార్టీ కమిటీలన్నీ ఈ సమస్యపై విస్తృతమైన ఆందోళనకు పూనుకోవాలని కూడా రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ కార్యవర్గం ఆదేశించింది.

ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ కార్యవర్గం ప్రకటనలో యిలా వుంది:

రెండవ పంచవర్ష ప్రణాళికా ముసాయిదాలో కవులుదార్ల హక్కులను గురించి, గరిష్ఠ పరిమితి, అదనపు భూముల పంపకాన్ని గురించి కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలు చేయబడ్డాయి. ఈ ప్రతిపాదనలు మొదటి పంచవర్ష ప్రణాళికలో చెప్పబడిన భూసంస్కరణలకంటె ముందడుగు వేశాయి. ఈ ప్రతిపాదనలు సక్రమంగా అమలు జరిగినపక్షంలో కవులుదార్లపై వున్న భారం తగ్గి, భూములపై జమాయితీ హక్కు పొందడానికి మార్గం ఏర్పడుతుంది. భూమిలేని వారికి కొంతవరకు భూవసతి ఏర్పడే అవకాశం కలుగుతుంది.

ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా భూస్వామ్య శక్తులు ఆందోళన సాగిస్తున్నాయి. భూస్వాముల ప్రాబల్యంగల అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తమ వ్యతిరేకతను బహిరంగంగానే తెలుపుతున్నాయి. మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి గోపాలరెడ్డి, మాజీ లోక్ పార్టీ ముఖ్యులు ప్రణాళికలోని భూసంస్కరణలకు వ్యతిరేకంగా ఆందోళన లేవదీసిన విషయం అందరికీ తెలిసినదే.

చేసిన మార్పు

పార్లమెంటుముందు పెట్టబడిన ముసాయిదానుబట్టి పాత ముసాయిదాలోని ప్రతిపాదనలలో కొన్నింటిని అభివృద్ధి నిరోధక మార్గంలో మార్పులు చేయడం జరిగిందని తేలుతుంది. గరిష్ఠ పరిమితిని నిర్ణయించడంలో 3,600/- నికరాదాయం వచ్చే భూమినిమాత్రం భూస్వామికి వదలి, ఆపైన భూమిని ప్రభుత్వం తీసుకోవాలనే స్పష్టమైన ప్రతిపాదనను తొలగించి, కుటుంబ కమతం నిర్వచించే ప్రతిపాదనను, అధికారాన్ని, దాన్నిబట్టి గరిష్ఠపరిమితిని నిర్ణయించేఅధికారాన్ని రాష్ట్రప్రభుత్వాల కియ్యడం జరిగింది. అలాగే భూస్వామికి యిచ్చే నష్టపరిహారాన్ని గురించికూడా మార్పుచేశారు. ప్రస్తుత కవులుదార్లు పంటలో 1/5 వంతును అప్పగించి, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే వసూలు చేసి, భూస్వాములకిస్తును, వసూలు ఖర్చులు మినహాయించుకొని, మిగతా మొత్తాన్ని భూస్వామికి యివ్వాలని, ఈ నష్టానికి 20 రెట్లు మించకుండా భూస్వామికి పరిహారం ఇవ్వాలని పాత ముసాయిదాలో వున్నది. పరిహారం ఎలా యివ్వాలనే ప్రాతిపదిక ఏమీ లేకుండా 20 ఏళ్లలో భూస్వామికి పరిహారం చెల్లించాలని మార్చారు. పాత ముసాయిదాలో న్యాయమైన కౌలురేటు మొత్తం పంటలో 1/5 అని స్పష్టంగా చెప్పబడగా కొత్త ముసాయిదాలో 1/4 లేక 1/5 అని అస్పష్టంగా చెప్పబడింది. ఒకవైపున దేశంలోని అభివృద్ధికాముకులంతా కమిషన్ భూసంస్కరణల ఉపసంఘం సూచనలు ప్రణాళికలో చేర్చాలని కోరుతుండగా, ప్లానింగ్ కమిషన్ ఈరకమైన అభివృద్ధి నిరోధకమైన మార్పులు చేయడాన్ని యీ కమిటీ తీవ్రంగా ఖండించుతోంది.

భూసంస్కరణలు జరగాలని కోరే పార్టీలు, గ్రూపులు, వ్యక్తులు ఐక్య ఆందోళన సాగించాలి. రెండవ పంచవర్ష ప్రణాళికను పార్లమెంటు ఉభయ సభలు చర్చిస్తున్నాయి. ప్లానింగ్ కమిషన్ యొక్క భూసంస్కరణల ఉపసంఘం సూచనలను ఆమోదించాలని ప్లానింగ్ శాఖా మంత్రి శ్రీ నందాకు టెలిగ్రాంలు, తీర్మానాలు పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

విశాఖపట్నంలో యిటీవల సమావేశమయిన రాష్ట్రకాంగ్రెసు సర్వసభ్య సమావేశం ఆంధ్రలో త్వరగా భూసంస్కరణలు అమలు జరపాలని మంత్రివర్గాన్ని ఆదేశిస్తూ తీర్మానించినందుకు యీ కమిటీ తన అభినందనలను తెలియపరుస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశంలో సమగ్రమైనభూసంస్కరణలబిల్లు తేవాలని మంత్రివర్గాన్ని కోరుతున్నాం. ఇందుకుగాను కాంగ్రెసు, కమ్యూనిస్టు, సోషలిస్టు, ప్రజాసోషలిస్టు పార్టీలు, యితర గ్రూపులు, సంస్థలు, వ్యక్తులు కలిసి విశాలమైన ఐక్య వుద్యమాన్ని తీసుకురావలసిందిగా విజ్ఞప్తిచేస్తున్నాం.

పార్టీ కమిటీలు యీ సమస్యపై విస్తృతమైన ఆందోళనకు పూనుకోవాలని, బహిరంగసభలు, అఖిలపక్ష మహాసభలు, విజ్ఞప్తులపై సంతకాల సేకరణ, యాత్రాదళాల ప్రచారం వగైరా ఆందోళనా పద్ధతులను చేపట్టాలని కోరుతున్నాం.

అణువిజ్ఞానంలో అమెరికాకన్నా రష్యా ముందంజ

అంతర్జాతీయ అణుశక్తి మహాసభలో అమెరికన్ శాస్త్రజ్ఞుని ఒప్పుకోలు

మాస్కో, మే 17

మరొక ఐదారేండ్లలో సోవియట్ యూనియన్ అణుశాస్త్ర విజ్ఞానంలో అమెరికాకన్నా ఎంతో ముందుకు పోతుందని ఇక్కడ అంతర్జాతీయ అణుశక్తి మహాసభకు హాజరవుతున్న అమెరికన్ శాస్త్రవేత్త లూయీ ఆల్వారెజ్ పేర్కొన్నారు.

“రష్యన్లు విస్తారంగా శాస్త్రజ్ఞులకు, ఇంజనీర్లకు శిక్షణ ఇస్తుండటమే అందుకు కారణం” అని ఆయనన్నారు.

ఆస్ట్రేలియన్ అణుశాస్త్రవేత్త ప్రొఫెసర్ ఓలిఫాంట్ మాట్లాడుతూ, మహాసభలో రష్యన్లు వెల్లడించిన సమాచారాన్ని చూచినట్లయితే, వారు ఎంత విలువైన పని సాగిస్తున్నారో తేలుతుంది అని అన్నారు. పరిశోధనా స్వాతంత్ర్యంలోనూ, నైపుణ్యంలోనూ, ఇతర దేశాలతో సోవియట్ సమఉజ్జీగా వుందన్నారు.

వాషింగ్టన్‌కి సోకర్నో రాక

వాషింగ్టన్, మే 16

ఇండోనేషియా అధ్యక్షుడు డాక్టర్ సోకర్నో నేడు వాషింగ్టన్ చేరుకున్నారు. అమెరికా ప్రభుత్వపు ఆహ్వానంపై వీరువచ్చారు.

అమెరికా, ఇండోనేషియాలమధ్య నిజమయిన పరస్పర అవగాహనకు వీరి రాక మార్గం ఏర్పరచగలదని ఆయన పత్రికావిలేఖరులతో అన్నారు.

సోవియట్‌లో కొత్త అణుశక్తి యంత్రం

మాస్కో, మే 16

5000కోట్ల ఎలెక్ట్రాన్ వోల్టులఅణుశక్తి యంత్రాన్ని సోవియట్ శాస్త్రజ్ఞులు నిర్మిస్తున్నారని ఇక్కడ జరుగుతున్న అంతర్జాతీయ అణుశక్తి మహాసభలో ప్రొఫెసర్ వి. వ్లాడిమిర్‌స్కీ తెలియజేశారు.

ప్రస్తుతం 1000 కోట్ల వోల్టుల యంత్రం సోవియట్‌లో వుంది. అయితే దీని నిర్మాణానికి అయిన ఉక్కుకన్నా, ఇది వినియోగించే విద్యుచ్ఛక్తికన్నా తక్కువ మొత్తాలను కొత్త యంత్రం వినియోగించుకుంటుందని ఆయన చెప్పారు.

కొత్త యంత్రంలోని 20 వేల టన్నుల మాగ్నెట్‌కి పాత యంత్రంలోని మాగ్నెట్‌కన్నా నూటికి 33 వంతుల తక్కువ ఉక్కు చాలునని కూడా ప్రొఫెసర్ వ్లాడిమిర్‌స్కీ చెప్పారు. కొత్తనమూనాలను కనిపెట్టడంవల్ల ఈ పొదుపు సాధ్యమైందన్నారు.

సోవియట్ విజ్ఞానశాస్త్ర పరిషత్తు ఏర్పాటుచేసిన ఈ మహాసభకు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, ఆస్ట్రియా తదితర దేశాలనుండి చాల మంది ప్రతినిధులు హాజరైనారు.

అమెరికా విధానాలపై కృశ్చేవ్ విమర్శ

ఫ్రెంచి నాయకులతో సంభాషించిన సందర్భంలో

మాస్కో, మే 16

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి కృశ్చేవ్ నేడు ఫ్రెంచి నాయకులతో సంభాషణలు జరిపిన సందర్భంలో అమెరికా అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా విమర్శించినట్లు తెలుస్తున్నది. నిరాయుధీకరణ, జర్మన్ ఏకీకరణ సమస్యలలో పరిష్కారానికి అవరోధం కలిగించే విధానాలను అమెరికా అనుసరిస్తున్నదని కృశ్చేవ్ పేర్కొన్నారట.

ఈ విమర్శలను మొలే, పినేలు స్నేహభావంతో విన్నారని, అయితే అమెరికా విధానాలను రష్యా అపార్థం చేసుకుంటున్నదని జవాబు చెప్పారని ఫ్రెంచి వర్గాలవారు తెలిపారు.

7 జిల్లాల్లో జిల్లాబోర్డు సలహా సంఘాలు

ఆంధ్ర ప్రభుత్వ నియామకం

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మే 27

ఆంధ్ర ప్రభుత్వం నెల్లూరు, అనంతపురం, గుంటూరు, ఉభయ గోదావరులు, విశాఖపట్నం, చిత్తూరు ఈ ఏడు జిల్లాలకు జిల్లాబోర్డు సలహా సంఘాలను ఏర్పరచింది.

జిల్లాబోర్డు ప్రత్యేకాధికారుల పదవీ పరిమితి ఈ సంవత్సరండిసెంబరు నెల తేదీవరకూ వుంటుంది. అందుకని ఈ సలహా సంఘాల పదవీ పరిమితి కూడా అంతవరకే వుంటుంది.

ఒకవేళ జిల్లాబోర్డు ప్రత్యేకాధికారుల పదవీ పరిమితిని పొడిగించే పక్షంలో ఈ సలహా సంఘాల పదవీ పరిమితికూడా సహజంగా పెరుగుతుంది.

ఈ సలహా సంఘాలలో కమ్యూనిస్టు శాసన సభ్యులున్న జిల్లాలలో మాత్రం ఒక్కొక్క కమ్యూనిస్టు శాసన సభ్యునికి అందులో సభ్యత్వం ఇచ్చారు. మిగతా జిల్లాలలో ఏ రూపంలోనుకూడా ప్రతిపక్షానికి స్థానం కల్పించలేదు.

నెల్లూరుజిల్లా సలహాసంఘంలో శ్రీ ఎస్. కాసిరెడ్డిగారు, గుంటూరుజిల్లా సలహా సంఘంలో శ్రీ మందపాటి నాగిరెడ్డిగారు, తూర్పు గోదావరిజిల్లా సలహా సంఘంలో శ్రీ పుత్సల సత్యనారాయణగారుసభ్యులుగా వున్నారు.

జిల్లాబోర్డుల మాజీ సభ్యులూ, పంచాయితీల నుంచి కనీసం మువ్వురు సభ్యులతో ప్రతి తాలూకాకు ప్రాతినిధ్యం వుండేలాగ జిల్లాబోర్డు సలహా సంఘాలను ఏర్పరచాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి పాఠకులకు విదితమే. వీటిలో ఒక మహిళకు, హరిజన, గిరిజన సభ్యులకు విధిగా సభ్యత్వం వుండాలన్న విషయం కూడా పాఠకులకు విదితమే.

ప్రభుత్వ రంగంలో ఏటా 20లక్షల టన్నుల ఉక్కు

ద్వితీయప్రణాళికలో పారిశ్రామిక పథకాలు

న్యూఢిల్లీ, మే 16

ప్రభుత్వ రంగంలో 1960-61 సంవత్సరంలో 20 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి కాగలదని ద్వితీయ ప్రణాళికలో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్లలో నెలకొల్పనున్న మూడు ఉక్కు ఫ్యాక్టరీలకు 350 కోట్లు కేటాయించారు. మైసూరు ఉక్కు, ఇనుము కర్మాగారాన్ని అభివృద్ధి చేయడానికి ఆరుకోట్లు కేటాయించారు.

ఈ ఉక్కు కర్మాగారాలకు పెట్టుబడి రూపంలోనైతేనేమి యంత్రాల రూపంలోనైతేనేమి విదేశీ సహాయం 7 కోట్ల వరకు లభ్యమౌతుంది. ఈ మూడు కర్మాగారాలనూ ముమ్ముందు బాగా విస్తరించాలనే దృష్టి ప్రణాళికలోవుంది. భిలాయిలో ఏటా 25 లక్షల ముక్కలు (ఇంగోట్) ఉత్పత్తిఅయేవరకూదీన్ని పెంపొందించవచ్చును. రూర్కెలా, దుర్గాపూర్ల ఫ్యాక్టరీలను 11 లక్షల 50 వేల ముక్కల ఉత్పత్తివరకూ పెంచవచ్చును.

ప్రభుత్వ రంగంలో నిర్మించనున్న భారీ పరిశ్రమల్లో భారీ విద్యుత్పరికరాలకు 20 కోట్లు, హిందుస్తాన్ యంత్ర పరికరాల కర్మాగార విస్తృతికీ పారిశ్రామిక యంత్రోత్పత్తికీ, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ సంస్థాపనకూ ప్రత్యేకంగా సొమ్మును కేటాయించారు.

దక్షిణాదినగల లిగ్నైట్ గనులను పెంపొందించడానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. దీనికోసం 52 కోట్లను ప్రస్తుతానికి కేటాయించారు. దీనికి మొత్తం ఖర్చు 68 కోట్లు కాగలదని అంచనా.

నంగల్ ఎరువుల ఫ్యాక్టరీకి 22 కోట్లు కేటాయించారు. రూర్కెలా ఎరువుల ఫ్యాక్టరీకి తాత్కాలికంగా 8 కోట్లు కేటాయించారు.

మరొక నౌకా నిర్మాణ కేంద్ర స్థాపనకు సన్నాహాలు చేయడానికిగాను 75 లక్షలను కేటాయించారు.

కేంద్ర ప్రభుత్వం స్థాపించే జాతీయ పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు 55 కోట్లు కేటాయించారు. ఇదికాక కేంద్రం స్థాపించే కొత్త పరిశ్రమలకోసం 502 కోట్లు కేటాయించారు. రాష్ట్రాల నిర్వహణ కింద నడిచే పరిశ్రమలకు 32 కోట్లను కేటాయించారు. వివిధ రాష్ట్రాలలోనూ స్థాపించే సహకార పంచదార ఫ్యాక్టరీల సహాయార్థం కేటాయించిన 5 కోట్ల రూపాయలు కూడా ఈ మొత్తంలో వున్నాయి.

ప్రభుత్వరంగంలోలాగానే ప్రయివేటు రంగంలోకూడా ఇనుమూ, ఉక్కుకే ప్రాధాన్యంవుంది. ప్రైవేటు రంగంలో ఇనుము, ఉక్కు పరిశ్రమకు 115 కోట్లు పెట్టుబడిని సూచించారు. ఈ రంగంలో ఇప్పుడు ఉక్కు, ఇనుము ఉత్పత్తి 12 లక్షల 50 వేల టన్నులు. అది ప్రణాళికా కాలంలో 23 లక్షల టన్నులకు పెరగగలదని అంచనా.

సిమెంటు 1955-56లో 49 లక్షల 30 వేల టన్నులు ఉత్పత్తి అయింది. దాన్ని ప్రణాళికా కాలంలో ఏటా 160 లక్షల టన్నులకు పెంచాలని సంకల్పం.

వాడకం వస్తువులు

వాడకం వస్తువులలో పంచదార 1955-56లో 16 లక్షల 70 వేల టన్నులు ఉత్పత్తి అయింది. దాన్ని 1960-61 నాటికి 25 లక్షల 50 వేల టన్నులకు పెంచాలని యోచన. ఈ ఉత్పత్తిలో సహకార పంచదార ఫ్యాక్టరీల వాటా 3 లక్షల 50 వేల టన్నులు.

వస్త్రోత్పత్తి 1960-61 నాటికి 800 కోట్ల గజాలకు, నూలు 1195 కోట్ల పౌన్లకు పెంచాలని ప్రణాళిక సంకల్పం. ఇందులో మిల్లులకు ఎంత కేటాయించాలి? చేమగ్గాలకూ, మరమగ్గాలకూ ఎంత కేటాయించాలి? నూలుమిల్లులకు ఎంతకేటాయించాలి. అంబర్ చర్ఖాలకు ఎంత కేటాయించాలి అన్నవిషయం ఇంకా నిర్ణయం కాలేదు. అయితే ఇప్పుడు లైసెన్సు ఇచ్చిన కదుళ్ళసంఖ్యను బట్టిచూస్తే 195 కోట్ల పౌన్ల నూలు ఉత్పత్తికి ఇప్పటికే అవకాశం వున్నదని ప్రణాళికాకర్తలంటున్నారు.

అటు వ్యవసాయంతోనూ, ఇటు పెద్ద పరిశ్రమలతోనూ సంబంధంకలవి గ్రామీణ సన్నకారు పరిశ్రమలు. ఈ పారిశ్రామిక సహకారాన్ని సర్వవిధాలా ప్రోత్సహించవలసివుంది. వికేంద్రీకృత పారిశ్రామికాభివృద్ధిలో చేతివృత్తుల వారికి స్వయంపోషకత్వం కల్పించడం అతి ప్రధానమైన అంశం.

గ్రామీణ సన్నకారు పరిశ్రమలకు ద్వితీయ ప్రణాళికలో 200 కోట్లు కేటాయించారు.

ఖర్గపురం రైల్వేకార్మిక సమ్మెలో 9 మంది అరెస్టు

సమ్మె చట్టవ్యతిరేకమని వ్రాసి యివ్వడానికి రీజనల్ లేబర్‌కమిషనర్ నిరాకరణ

(విశాలాంధ్ర విలేఖరి)

ఖర్గపురం, మే 17

ఖర్గపురం రైల్వే సమ్మె సందర్భంలో నిన్న వుదయం తొమ్మిది మంది యూనియన్ కార్యకర్తలు అరెస్టుఅయ్యారు. అరెస్టు అయినవారిలో బ్రాంచి సెక్రటరీ కూడ వున్నారు.

నిన్న సాయంత్రం ఈ సందర్భంలో గొప్పబహిరంగసభ జరిగింది. రీజినల్ లేబర్ కమిషనర్, సౌత్ ఈస్టరన్ రైల్వే జనరల్ సెక్రటరీగారలు ఉపన్యసించారు.

సమ్మె చట్టవ్యతిరేకమని వ్రాసి ఇవ్వడానికి రీజినల్ లేబర్ కమిషనర్ ఒప్పుకోలేదు.

ఈవేళ మరో 2,000 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

యుగోస్లావియాకు అమెరికా సాయం

సగానికిసగం కోత

వాషింగ్టన్, మే 16

యుగోస్లావియాకు సహాయంగా ఐసెన్‌హోవర్ ప్రభుత్వం సూచించిన 3 కోట్ల డాలర్లను సగానికి కోత పెట్టాలని అమెరికా శాసనసభ విదేశ వ్యవహారాల సంఘం నిర్ణయించింది.

ఆంధ్ర సముద్ర తీరంలో ఇల్మనైట్, మోనజైట్‌లు

హెచ్చుగా లభ్యమయ్యే అవకాశం గలదని లోక్‌సభలో ప్రధాని నెహ్రూ వెల్లడి

న్యూఢిల్లీ, మే 17

ఆంధ్ర సముద్రతీరంలోఇల్మనైట్ మోనజైట్ లోహాల పరిశోధన కోసం అణుశక్తి డిపార్టుమెంటుకు సంబంధించిన ఒక బృందం కృషి చేస్తున్నదని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

ఈ బృందం ఆంధ్ర విశ్వవిద్యాలయ భూగర్భశాస్త్ర డిపార్టుమెంటు అజమాయిషీ క్రింద పని చేస్తున్నదని కూడా శ్రీ నెహ్రూ చెప్పారు.

కొన్ని ఉపప్రశ్నలకు ప్రధాన మంత్రి సమాధానం చెపుతూ, ప్రథమ సమాచారాన్నిబట్టి ఆంధ్ర సముద్రతీరానఇల్మనైట్, మోనజైట్ లోహం హెచ్చుగా లభ్యం కాగలదని అంచనా వేస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం ఇల్మనైట్, మోనజైట్ లోహాలు మనకు తిరువాన్కూర్ తీరంలో అవసరమైనంతగా లభ్యం అవుతున్నదని ఆయన చెప్పారు.

ఈజిప్టుచే చైనా ప్రభుత్వ గుర్తింపు

కైరో, మే 16

చైనా ప్రజారిపబ్లిక్ ప్రభుత్వాన్ని గుర్తించడానికి ఈజిప్టు మంత్రివర్గం నేటిరాత్రి నిర్ణయించినట్లు అధికార ప్రకటన వెలువడింది.

మంత్రివర్గ సమావేశానికి ప్రధాని నాజర్ అధ్యక్షత వహించారు. సమావేశానంతరం మంత్రివర్గ కార్యదర్శి అలీసాబ్రీ ఇక్కడ చైనా వాణిజ్య కార్యాలయాధిపతి లింగ్‌చింను పిలిచి ఈ నిర్ణయాన్ని తెలియజేశారు.

అనంతరం లింగ్‌చిం విలేఖరులతో మాట్లాడుతూ ఈజిప్టు నిర్ణయానికి చైనా ప్రజలు ఆనందిస్తున్నారు. దీనివల్ల ఉభయదేశాల సఖ్యత పెంపొందగలదని, ప్రపంచ శాంతి పటిష్టమవుతుందని పేర్కొన్నారు.

భారతీయ సాహిత్య సమ్మేళనం

ఎర్నాకుళం, మే 16

కేరళ సాహిత్య పరిషత్తు రజతోత్సవాల సందర్భంలో ఇక్కడ భారత దేశంలో 14 భాషలకు చెందిన రచయితలతో భారత సాహిత్య సమ్మేళనం జరుగుతోంది. సమ్మేళనం రెండు రోజులపాటు సాగుతుంది. ఇలాంటి సమ్మేళనం జరగడం ఇదే ప్రథమం.

వివిధ భాషల రచయితలు ఒక చోటచేరి ఒకరి అభిప్రాయాలను ఒకరు తెలుసుకోవడంకోసం ఈ సమ్మేళనాన్ని ఏర్పాటుచేశారు.

కేరళ సంస్కృత పండితులు డాక్టర్ కుంజన్నిరాజా సమ్మేళనానికి అధ్యక్షత వహించారు.

కేరళ సాహిత్య పరిషత్తు నిర్మాతలలో ఒకరూ ప్రసిద్ధ కవి అయిన శ్రీ శంకరకురుప్పు సభికులకు స్వాగతం ఇస్తూ, అన్ని భాషల సాహిత్య వేత్తలతోనూ ఒక భారతీయ సాహిత్యమండలి ఏర్పడ్డం అవసరమని సూచించారు. ఇలాంటి మండలి సాహిత్య అకాడమీకి పోటీకాబోదన్నారు. పైగా ఇదిదానికి సహాయకారి కాగలదన్నారు.

బెంగాలీ కవి శ్రీ బుద్ధదేవబోస్ సమ్మేళనాన్ని ప్రారంభించారు. రచయితలు తమ మాతృభాష కాక, ఇతర భారత భాషలు ఒకటి రెండు నేర్చుకోవాలనీ, ఇతర భాషల్లోని ఉత్తమ సాహిత్యగ్రంథాలను ఆ భాషలనుంచే నేరుగా అనువదించడం ఉచితమనీ ఆయన అన్నారు.

శ్రీ గౌరకుమార్ బ్రహ్మ (ఒరిస్సా) ఒరియాసాహిత్యంమీద నాడూ, నేడూ కూడా మతప్రభావం చాలా వుందని చెప్పారు.

ఆయా భాషల రచయితలు తమ తమ సాహిత్యాలలోని మెరుగులను వివరించారు.

సాహిత్య అకాడమీ సహాయ కార్యదర్శి శ్రీ ప్రభాకర్ మాచ్వే సదస్యులను పరిచయం చేశారు.

ఉష్ణోగ్రత

విజయవాడ, మే 17

ఈవేళ విజయవాడలో ఉష్ణోగ్రత 111 డిగ్రీలు ఉన్నది.

1956 మే 18 శుక్రవారం
దుర్ముఖినామసంవత్సర వైశాఖ బహు
నవమి రా. 8-46 మఖ ఉ. 6-35

విశాలాంధ్ర

శుక్రవారం 18—5—56

రెండవపంచవర్షప్రణాళిక ప్రభుత్వ-ప్రైవేటురంగాలు

* * *

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలను గురించి, స్వరూపాన్ని గురించి 1955 ఏప్రిల్ నుంచి దేశమంతటా చర్చలు జరుగుతున్నాయి. ప్రొఫెసర్ మహాలనోబిస్ తయారు చేసిన ప్రణాళికా చట్రం (ప్లాన్ ఫ్రేమ్) ముందుగా ప్రజల దృష్టిని ఆకర్షించింది. తరువాత ప్లానింగ్ కమిషన్ నియమించిన ఆర్థిక వేత్తలు తయారు చేసిన రెండవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదా గత ఫిబ్రవరిలో ప్రకటించబడింది. భారతదేశ ఆర్థికాభివృద్ధిని కాంక్షించే వారందరూ వాటిని సాకల్యంగా చర్చించడం జరిగింది.

భారత పార్లమెంటులో 15న తేదీన ద్వితీయ పంచవర్ష ప్రణాళికపై ప్లానింగ్ కమిషన్ రిపోర్టును ప్రధాని నెహ్రూ ప్రతిపాదించారు. పార్లమెంటు ఉభయ సభావేశాలలోనూ దానిపై చర్చలు సాగుతాయి. మన దేశ భవిష్యత్తుకు, ఆర్థికాభివృద్ధికి ప్రాతిపదికకానున్న ద్వితీయ పంచవర్ష ప్రణాళికను ప్రజలంతా జాగ్రత్తగా పరిశీలించవలసి వుంది. ప్రణాళికా స్వరూపాన్ని తీర్చిదిద్దడంలో, మన దేశ సర్వతోముఖాభివృద్ధికి, ప్రజాశ్రేయస్సుకు అనుగుణ్యంగా ప్రణాళికను రూపొందించడంలో ప్రజలు భాగస్వాములు కావలసి వుంది.

మొదటి పంచవర్ష ప్రణాళికలో పరిశ్రమాభివృద్ధికి అగినంత ప్రాముఖ్య మివ్వలేదు. ఆహారోత్పత్తిని ఎక్కువ చేయడానికి అవుసరమైన నదీలోయ ప్రాజెక్టులకు ఎక్కువ ప్రాధాన్య మివ్వబడింది. ఆహార ధాన్యాలలో నూటికి 20 వంతులు, ప్రత్తి నూటికి 45 వంతులు, నూనెగింజలు నూటికి 8 వంతులు ఉత్పత్తి పెరిగిందని ప్లానింగ్ కమిషన్ రిపోర్టు తెలుపుతోంది. గత ఐదేళ్ళలోనూ జాతీయాదాయం నూటికి 18 వంతులు పెరిగిందని అంచనా వేసింది.

కాని దేశప్రజలలో సగటున మనిషి 1 కి ఆదాయం నూటికి 11 వంతులు మాత్రం పెరిగిందనీ, కొనుగోలుశక్తి 9 వంతులు మాత్రమే పెరిగిందనీ ప్లానింగ్ కమిషన్ రిపోర్టు తెలుపుతోంది. అంతేకాదు, మన దేశప్రజల జీవిత ప్రమాణం ప్రపంచంలో చాల తక్కువస్థాయిలో వున్న దేశాలవలె కనాకష్టంగా వుందనికూడ గుర్తు చేసింది. ప్రజాసామాన్యం తినే ఆహారం సౌష్టవంగా జీవితం గడిపేందుకు అవుసరమైనదానికంటే చాల తక్కువగా వుంది. మనిషికి సగటున వాడే గుడ్డ యుద్ధానికి పూర్వమున్న తక్కువ స్థాయిలోనే వుంది. ప్రజలలో అనేకమందికి తలదాచుకొనేందుకు యిల్లూ, వాకిలీ లేదు. మన జనాభాలో దాదాపు సగంమందికి నెలకు సగటున మనిషికి రు. 13/-ల కంటే ఖర్చు చేయగల తాహతు లేదు

మన ఆర్థిక విధానం వెనుకబడి వున్నందున, మన దేశంలో సహజ సంపద కావలసినంత వున్నప్పటికి దానిని సద్వినియోగం చేసేందుకు అవుసరమైన పారిశ్రామికాభివృద్ధి లేనందున, మన ప్రజలలో అత్యధికభాగం దుర్భర దారిద్ర్యం అనుభవించుతున్నారు. అందుచేత ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి ప్రథమ స్థానం యివ్వాలిసి వుంది. ఈ అవుసరాన్ని ప్లానింగ్ కమిషన్ గుర్తించినందుకు దేశ శ్రేయోభిలాషులందరూ హర్షించుతారు.

అదే సమయంలో మన దేశ పారిశ్రామిక రంగాన్ని కేవలం పెట్టుబడిదారులకు వదలివేసిన సత్వరాభివృద్ధి జరుగదు. అంతేగాక, లాభాలను ప్రధానంగా యెంచే పెట్టుబడిదారులు దేశ ఆర్థిక వ్యవస్థకు బలప్రదమైన పునాదిని చేకూర్చే ఇనుము, ఉక్కు, ఇంజనీరింగ్ వగైరా కీలక పరిశ్రమలలో పెట్టుబడిని పెట్టడానికి ముందుకురారు. అందుచేత కీలక పరిశ్రమలను నిర్మించేందుకు ప్రధానంగా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవడం సమంజసంగా వుంది.

ఏయే పరిశ్రమలు ప్రభుత్వ యాజమాన్యాన నిర్మించాలో, ఏ పరిశ్రమలను ప్రయివేటు రంగానికి వదలాలో తెలుపుతూ ప్లానింగ్ కమిషన్ ఒక జాబితా ప్రకటించింది. ఆయుధోత్పత్తి వగైరా దేశరక్షణాకు సంబంధించిన పరిశ్రమలు, పరమాణుశక్తి, ఇనుము, ఉక్కు, లోహ పరిశ్రమ, పెద్ద బరువైన ఉక్కు యంత్రాలవోత, ఎలక్ట్రికల్ యంత్రాల నిర్మాణం, బొగ్గు, నూనె గనులు, ఇనుము, మాంగనీస్, జిప్సమ్, క్రోమ్, గంధకం, బంగారం, వజ్రాల త్రవ్వకం, రాగి, సీసం, జింక్, టిన్ వగైరా లోహ పరిశ్రమలు, విమాన నిర్మాణం, రైల్వేలు, ఓడల నిర్మాణం, టెలిఫోన్, టెలిగ్రాఫు తీగలు, యంత్రాల వుత్పత్తి యివన్నీ ప్రభుత్వ రంగంలో వుంటాయి.

కెమికల్సు, ఎరువులు, రబ్బరు, ఎల్యూమినం వగైరా లోహాలు, రోడ్డు రవాణా, సముద్రయానం, మెషిన్ టూల్స్ వగైరాను వగైరా 12 తరగతులను ప్రయివేటు రంగానికి ప్రభుత్వం వదలివేసింది.

ఈ విభజనను జాన్‌మత్తయ్ లాంటి గుత్తపెట్టుబడిదారుల ప్రతినిధులు తీవ్రంగా అధిక్షేపించారు. ప్రయివేటు రంగానికి తగిన అవకాశా లివ్వడంలేదనీ, ప్రభుత్వరంగానికే ముఖ్యమైన పరిశ్రమలను కేటాయించారనీ ఆక్షేపించారు. నిజానికి ఓడల నిర్మాణం సింధియా కంపెనీ ప్రారంభించినా ప్రభుత్వం హస్తగతం చేసికోవలసి వచ్చింది. విమానయానం అలాగే ప్రభుత్వ పరమయింది. ఈ వుదాహరణాలను గమనించితే మత్తయ్ విమర్శనలు సరికావని రుజువవుతుంది.

ప్రజాశ్రేయస్సు దృష్టితో పరిశీలించితే ప్లానింగ్ కమిషన్ చేసిన కేటాయింపు కొంతవరకు సవ్యంగానే వుంది. మెషిన్ టూల్స్, హెవీ కెమికల్స్ పరిశ్రమలుకూడ ప్రభుత్వ యాజమాన్యాన నిర్మించడం అవసర మనుకుంటున్నాము. ప్రయాణ సౌకర్యాలుకూడ ప్రభుత్వమే నడిపితే ప్రజాశ్రేయస్సుకు అనుగుణ్యంగా వుంటుంది.

రెండవ ప్రణాళిక కాలంలో ప్రభుత్వరంగంలో 4800 కోట్ల రూపాయలు, 2400 కోట్లు ప్రయివేటురంగంలోనూ పెట్టుబడిగా అవుసర మవుతుందని ప్లానింగ్ కమిషన్ నిర్ణయించింది.

ఇందులో పరిశ్రమలకు, గనులకు 890 కోట్లు కేటాయించారు. ఇర్రిగేషన్, పవరు ప్రాజెక్టులకు 913 కోట్లు కేటాయించారు. రవాణా సౌకర్యాలకు కేటాయించిన 1385 కోట్లలో రైల్వేలకు 900 కోట్లు ప్రత్యేకించారు. వ్యవసాయాభివృద్ధికి 568 కోట్లు కేటాయించారు. విద్య, ఆరోగ్య, గృహ నిర్మాణం, నిరుద్యోగ నివారణ వగైరా సమాజ సంక్షేమ పథకాలకు 945 కోట్లు నిర్ణయించారు.

ఇంతవరకు భారతదేశంలో ఎన్నడూ పెద్దయెత్తున ప్రణాళికా నిర్వహణ జరుగలేదు. అందుచేత ద్వితీయ ప్రణాళిక లక్ష్యాలు చాలమందిని ఆకర్షించుతున్నాయనడంలో సందేహంలేదు. అదే సమయంలో దీనిని జయప్రదంగా నిర్వహించగల స్తోమతు, వనరులు వున్నాయా అనే అనుమానాలు కలగడంకూడ సహజమే. కాన ప్రణాళికను జయప్రదం చేయడానికి ప్లానింగ్ కమిషన్ అనుసరించదలచిన విధానాలను సాకల్యంగా పరిశీలించాలిసి వుంది. వరుసగా అందుకు పూనుకుందాము.

ఇండొనేషియా పార్లమెంటరీ ప్రతినిధివర్గం

కలకత్తామీదుగారష్యాపయనం

కలకత్తా, మే 15

సుప్రీం సోవియట్ అధ్యక్షుని ఆహ్వానంపై రష్యా వెడుతున్న ఇండొనేషియా పార్లమెంటరీ ప్రతినిధివర్గం వారు నేడు కలకత్తా చేరారు. ఇండొనేషియా పార్లమెంటు స్పీకరు సర్టానో, డిప్యూటీ స్పీకర్ అర్మాన్, మరొక ఇద్దరు పార్లమెంటు సభ్యులు ఈ ప్రతినిధివర్గంలో వున్నారు.

విమానాశ్రయంలో స్పీకర్ సర్టానో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ, తమ దేశంలో జనరల్ ఎన్నికలు చాల సాఫీగా సాగిపోయాయని, 4 కోట్లమంది ఓటర్లలో నూటికి 80 మంది ఓటు చేశారని అన్నారు. ఓటర్లలో అధిక సంఖ్య స్త్రీలని చెప్పారు.

కమ్యూనిస్టు పార్టీ వారు ప్రభుత్వంలో చేరకపోయినప్పటికీ, ఇంతవరకూ ప్రతిపక్షంగా వ్యవహరించడం లేదని, నూతన ప్రభుత్వ కార్యక్రమానికి వారుకూడా ఓటు చేశారని సర్టానో తెలిపారు.

లంక ఎన్నికల ఫలితాలకు ఆయన హర్షం వెలిబుచ్చారు.

అహమ్మద్ నగర్ జిల్లా కమ్యూనిస్టుల అరెస్టులు

సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో

అహమ్మద్‌నగర్, మే 15

ఊరేగింపులు, సభలపై పెట్టిన నిషేధాజ్ఞలను ఉల్లంఘించారనే ఆరోపణతో శివగాంలో జిల్లా కమ్యూనిస్టు కమిటీకార్యదర్శి శ్రీ భాగవత్‌ను సహ 45 మందిని నేడు అరెస్టు చేశారు. బొంబాయితో సహా సంయుక్త మహారాష్ట్ర ఏర్పరచాలని వీరు ప్రదర్శన జరిపారు.

న్యూజిలాండ్‌కి జనవరిలో నెహ్రూ ప్రయాణం

కాన్‌బెర్రా, మే 16

ప్రభుత్వ ఆహ్వానంపై భారత ప్రధాని నెహ్రూ జనవరిలో న్యూజిలాండ్ వస్తున్నారని, న్యూజిలాండ్ ప్రధాని మెంజీస్ నేడు ప్రకటించారు.

ద్వితీయప్రణాళికకాలంలో విద్య,వైద్య,రహదారుల అభివృద్ధి పథకాలు

న్యూఢిల్లీ, మే 16

ద్వితీయ ప్రణాళికా కాలంలో 20 వేల తపాలా ఆఫీసులూ, 1400 టెలిగ్రాఫు ఆఫీసులూ 1200 టెలిఫోను పబ్లిక్ కాల్ ఆఫీసులూ, నెలకొల్పడానికి సంకల్పించారు.

లక్షా 80 వేల కొత్త టెలిఫోన్లను నెలకొల్పుతారు. వీటి కోసమూ, రేడియో ప్రసారాభివృద్ధికీ కలిపి 76 కోట్ల రూపాయలను కేటాయించారు.

ద్వితీయ ప్రణాళికాంతానికి విదేశాలతో ఉత్తర ప్రత్యుత్తర సౌకర్యాలను కూడా బాగా పెంపొందిస్తారు. మరో 25 దేశాలతో భారతదేశానికి రేడియో, టెలిగ్రాఫ్, టెలిఫోన్, ఫొటో సంబంధాలు నెలకొంటాయి. ప్రథమ ప్రణాళికాంతానికి భారతదేశానికి 14 దేశాలతో ప్రత్యక్ష రేడియో టెలిగ్రాఫ్ సంబంధాలూ, 6 దేశాలతో ప్రత్యక్ష రేడియో టెలిఫోన్ సంబంధాలూ, 5 దేశాలతో రేడియో ఫొటో సంబంధాలూ ఏర్పడ్డాయి.

రేడియో ప్రసారం

ద్వితీయ ప్రణాళికా కాలంలో రేడియో ప్రసారాన్ని అన్ని భాషలలోనూ ఇంకా విశాలప్రాంతాలకు విస్తరించాలని సంకల్పం. ఇందుకు తొమ్మిదికోట్ల రూపాయలను కేటాయించారు భూమి సమతలంగా లేని ప్రాంతాలలో షార్టువేవ్ ట్రాన్స్‌మీటర్లను నెలకొల్పుతారు. జాతీయ కార్యక్రమాలు ఇంకా ఎక్కువకావాలని కోరుతున్నారు. అందుకని ఢిల్లీలో నూరు కిలోవాట్ల షార్టువేవ్ ట్రాన్స్‌మీటర్నూ, నూరు కిలోవాట్ల మీడియమ్ వేవ్ ట్రాన్స్‌మీటర్నూ నెలకొల్పాలని సంకల్పించారు.

కలకత్తా, బొంబాయి, మద్రాసులలో 50కిలోవాట్ల షార్టువేవ్ ట్రాన్స్‌మీటర్లను నెలకొల్పుతారు. విదేశ ప్రసారాలకు కూడా ఢిల్లీలో అదనపు ఏర్పాట్లు చేస్తారు.

టెలివిజన్ రంగంలోకూడా నాంది వాచకం జరగాలని సంకల్పించారు వేయిమంది పైబడ్డ జనాభాగల గ్రామాలకు సాముదాయక రేడియోలను సరఫరా చేస్తారు.

విద్యారంగం

ప్రణాళికా కాలంలో ప్రాథమిక పాఠశాలలనూ, క్రింది తరగతి ఆధార పాఠశాలలనూ అదనంగా 5000 నెలకొల్పాలని సంకల్పించారు. మాధ్యమిక పాఠశాలలూ, పై తరగతి ఆధార పాఠశాలలూ 3500 నెలకొల్పుతారు.

సెకెండరీ విద్యాసంఘంవారు చేసిన సూచనలమేరకు సెకెండరీవిద్య పునర్వ్యవస్థీకరణం 2ఏండ్ల క్రిందటే ప్రారంభమైంది. దాన్ని ఈ ద్వితీయ ప్రణాళికా కాలంలో కొనసాగిస్తారు. విద్యార్థుల అభిరుచులకనువుగా వివిధ విషయాలను బోధించడంకోసం సర్వార్థసాధక పాఠశాలల సంఖ్యను 1961 నాటికి 1187 కి పెంచుతారు. వీటి సంఖ్య ఇప్పుడు 250 మాత్రమే.

సాంకేతిక వృత్తివిద్యలకు విశ్వవిద్యాలయాలవారు ఎక్కువ అవకాశాలు కల్పించవలసిన అవసరం వుంది. అలాగే విశ్వవిద్యాలయాల విద్యాస్థాయిని కూడా పెంచవలసి వుంది.

సాంకేతిక విద్యా నిపుణుల అవసరం నానాటికీ పెరుగుతోంది. అందుకని ఖర్గపూర్‌లోని భారత సాంకేతిక సంస్థనూ, ఢిల్లీలోని పాలీటెక్నిక్‌నూ ఇంకా పెంపొందించడానికి నిశ్చయించారు. దేశపశ్చిమ, ఉత్తర,దక్షిణ ప్రాంతాల్లో మూడు ఉన్నత సాంకేతిక సంస్థలను నెలకొల్పాలని నిర్ణయించారు. సాంకేతిక విద్య అన్ని స్థాయిల్లోనూ చక్కగా పెంపొందడానికిగాను సాంకేతిక ఉపాధ్యాయుల తర్ఫీదుకు కూడా తరగతులు నడుపుతారు.

ధనాబాద్‌లోని భారత భూగర్భశాస్త్ర పాఠశాలను పెంపొందించి ఖనిజ శాస్త్రంలోనూ, గనికి సంబంధించిన ఇతర శాస్త్రాలలోనూ తర్ఫీదునివ్వడానికి ఇతోధిక సౌకర్యాలు కల్పిస్తారు. మరో 18 ఇంజనీరింగు కళాశాలలనూ 62 ఇంజనీరింగ్ పాఠశాలలనూ స్థాపించాలని ఇంజనీరింగు కమిటీవారు చేసిన సూచనను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

ఉపాధ్యాయుల వేతనాభివృద్ధి

ఉపాధ్యాయుల వేతనాలను పెంచడం అవసరం. ప్రాథమికోపాధ్యాయుల జీతాలు పెంచడంవల్ల రాష్ట్రాలకు తగిలే అదనపు ఖర్చులో సగం భరించడానికి కేంద్రం ఒప్పుకొంది. ప్రాథమికోపాధ్యాయులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రణాళిక సంఘంవారు సలహా ఇచ్చారు.

దీనివల్ల ఉపాధ్యాయులకు భద్రత, ప్రావిడెంటు ఫండు ప్రమోషన్ల అవకాశాలు కలుగుతాయి.

అర్హులైన విద్యార్థులకు ఇతోధిక అవకాశాలు కల్పించడంకోసం విద్యార్థి వేతనాలివ్వాలని ప్రణాళికా సంఘం వారు సూచించారు. విద్యారంగంలో ఈ అభివృద్ధికోసం 307 కోట్లు కేటాయించారు.

పరిశోధనావకాశాలను కూడా బాగా పెంపొందించాలని ప్రణాళిక సంఘంవారి సంకల్పం.

ఆరోగ్యం

ప్రస్తుతంవున్న ఆరోగ్య సంస్థలను పెంపొందించి ప్రజలందరికీ అవి అందుబాటులోకి వచ్చేటట్లు చేయాలి.

బోధనా ఆస్పత్రులూ, జిల్లా ఆస్పత్రులూ, తాలూకా ఆస్పత్రులూ, గ్రామీణ వైద్యకేంద్రాలూ మున్నగు వాటితో ప్రాంతీయ ఆస్పత్రి పద్ధతిని పటిష్టంచేయాలి. వైద్యుల కొరత చాలా వుంది. అందుకని కొత్తవైద్య కళాశాలలను నెలకొల్పడం, వున్న వాటిని పెంపొందించడం కోసం 28 కోట్ల రూపాయలు కేటాయించారు. నర్సులూ, మంత్రసానులూ, కాంపౌండర్లు, శానిటరీ ఇనస్పెక్టర్లు మున్నగు వారి తర్ఫీదును ఇంకా ఎక్కువ చేస్తారు.

దేశీయ వైద్య విధాన అభివృద్ధికి ఆయిదున్నర కోట్లు కేటాయించారు.

మళ్లీ సింగ్మన్‌రీ ఎన్నిక

దక్షిణ కొరియా అధ్యక్షుడుగా

సియోల్, మే 16

దక్షిణ కొరియా అధ్యక్షుడుగా సింగ్మన్‌రీ మళ్ళీ అధ్యక్షుడుగా ఎన్నికైనారు. అయితే ఈసారి ఆయన ప్రత్యర్థికి బాగా ఓట్లు వచ్చాయి. సింగ్మన్‌రీకి 48 లక్షల ఓట్లురాగా, ప్రత్యర్థికి 20 లక్షలు వచ్చాయి.

ప్రణాళికలో ఆహార విద్యుచ్ఛక్తిపథకాలు

న్యూఢిల్లీ, మే 16

ద్వితీయ ప్రణాళికా కాలంలో ఆహార పదార్థాల వాడకం పెద్దవానికి తలకు 18.3 ఔన్సులకు పెరగగలదని ఆశిస్తున్నారు.

ఈ కాలంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి కోటి టన్నులు పెరుగుతుంది ఇందులో బియ్యం 40 లక్షల టన్నులు, గోధుమలు 20 లక్షల టన్నులు, ఇతర ధాన్యాలు 20 నుంచి 30 లక్షల టన్నులు, పప్పుదినుసులు 15 నుంచి 20 లక్షలటన్నులు పెరుగుతాయి

ప్రణాళికా కాలంలో 2 కోట్ల ఎకరాలను సాగులోకి తేవాలనిసంకల్పం. ఇందులో 120 లక్షల ఎకరాలు పెద్ద ప్రాజెక్టులూ, మధ్యరకం ప్రాజెక్టుల క్రింద 90 లక్షల ఎకరాలు చిన్న ప్రాజెక్టుల క్రింద వుంటాయి. 15 లక్షల ఎకరాలభూమిని సాగుకులాయకుచేస్తారు. 50 లక్షల ఎకరాలను బాగుచేస్తారు.

ఇప్పుడు 5 లక్షల ఎకరాల్లోవున్న తోటల భూసారాన్ని పెంచుతారు. 208,080 ఎకరాలలో కొత్తతోటలు వేస్తారు. పట్నాల పరిసరాలలో కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహిస్తారు. కూరగాయలు పెంచేవారికి మేలువిత్తనాలు, నారు సప్లయిచేయడానికి ఏర్పాట్లుచేస్తారు.

పశు సంపదను పెంపొందించడంకోసం కొత్తగా 1258 ప్రధాన గ్రామాలనూ, 245 కృత్రిమ గర్భధారణ కేంద్రాలనూ, 254 విస్తరణ కేంద్రాలనూ నెలకొల్పుతారు. పశు చికిత్సకు 1900 చికిత్సాలయాలను ప్రణాళికా కాలంలో నెలకొల్పుతారు.

ఇప్పుడు దేశంలో పాలవాడకం తలకు 5 ఔన్సులు. వచ్చే పది పదిహేను సంవత్సరాలలోనూ ఈ వాడకాన్ని 15 ఔన్సులకు పెంచడం ప్రణాళికా కార్యకర్తల ఆశయం. ఇందుకోసం నగరాలలో కొత్తగా 36 పాల సరఫరాకేంద్రాలనూ, 12 సహకార వెన్న కేంద్రాలనూ, 7పాలపొడి ఫ్యాక్టరీలనూ నెలకొల్పుతారు, ఎక్కువ పాలిచ్చే గోజాతిని తయారు చేయడంకోసం అందుకు సంబంధించిన కేంద్రాలను నెలకొల్పుతారు, అలాగే గొర్రెల జాతులను సృష్టించడానికి మూడు కేంద్రాలను నెలకొల్పుతారు. ఏటా ఇప్పుడు గుడ్లవాడకం తలకు నాలుగు. దీన్ని 20 కి పెంచడానికి అనువుగా కోళ్ల పెంపకాన్ని కూడా అభివృద్ధి చేస్తారు.

మత్స్య పరిశ్రమకు 12 కోట్లు కేటాయించారు. ఈ పథకాల వల్ల మత్స్య ఉత్పత్తి మూడవవంతు పెరుగుతుంది. బెంగాల్, కేరళ, ఒరిస్సాలలో వీటిని అభివృద్ధిచేస్తారు.

ప్రణాళికా కాలంలో 188 కొత్త ఇర్రిగేషన్ ప్రాజెక్టులను నిర్మిస్తారు. ఇందులో 10 ప్రాజెక్టులకు ఒక్కొక్కదానికి 10 నుంచి 30 కోట్లకవరకూ ఖర్చు అవుతుంది. 80 ప్రాజెక్టులకు 5 నుంచి 10 కోట్ల వరకూ ఖర్చు అవుతుంది. మిగతా వాటికి 5 కోట్లకన్న తక్కువ ఖర్చు అవుతుంది. ఇందులో మధ్యరకం ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చారన్నమాట. అదనంగా 3561 గొట్టం బావులను తవ్వడానికి సంకల్పించారు.

ప్రణాళికా కాలంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి రెట్టింపు అవుతుంది. ఇప్పటి వుత్పత్తి 34 లక్షల కిలోవాట్లు. అది ప్రణాళికాంతానికి 69 లక్షలకు పెరుగుతోంది. 44 కొత్త విద్యుచ్ఛక్తి కేంద్రాలను నిర్మిస్తారు. ఇందులో 25 జలవిద్యుచ్ఛక్తి కేంద్రాలు, 19 థర్మల్ స్టేషన్లు. వీటిలో 10కోట్లకుపైన వ్యయం కాగలపథకాలు 10వున్నాయి. 5 నుంచి 10 కోట్ల వరకూ ఖర్చు ఆయ్యే పథకాలు 4. కోటి నుంచి 5 కోట్ల వరకూ ఖర్చు అయ్యే పథకాలు 18. కోటికన్నా తక్కువఖర్చు కాగలవి 12.

ప్రణాళికా కాలంలో 75 కోట్ల ఖర్చుతో 18 వేల చిన్న పట్నాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేస్తారు.

ప్రణాళికా కాలంలో ఖనిజసంపద

న్యూఢిల్లీ, మే 16

ద్వితీయ ప్రణాళికలో ఖనిజాలకు సంబంధించిన అధ్యాయంలో తొలి ప్రణాళిక ముసాయిదాను ప్రకటించిన నాటికీ నేటికీ ఈరంగంలో వచ్చిన అభివృద్ధిని సమీక్షించారు.

ప్రభుత్వరంగంలో వజ్రపు గనులను చేపట్టడానికీ, ఒక రాగి గనిని నడపడానికీ సంకల్పించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రాల పథకాలలో రాయచూరు జిల్లాలోని హట్టి బంగారు గనుల అభివృద్ధిని పేర్కొన్నారు.

బొగ్గు విషయంలో ప్రణాళికాంతానికి 6 కోట్ల టన్నులు ఉత్పత్తికావాలన్న లక్ష్యాన్ని అలాగే వుంచారు. కాగా ప్రభుత్వ ప్రైవేటు రంగాలకు కేటాయించిన దానిలో మాత్రం కొంత మార్పువచ్చింది. 1954 నాటి ఉత్పత్తిని ఆధారం చేసుకొని ప్రభుత్వ రంగంలో 150 లక్షలూ, ప్రైవేటు రంగంలో 80 లక్షల టన్నులూ అదనంగా ఉత్పత్తి చేయాలని ముసాయిదాలో నిర్ణయించారు. 1954 నాటి లెక్కల ప్రకారం మొత్తం బొగ్గు ఉత్పత్తి 370లక్షల టన్నులు. ఇప్పుడు 1955 నాటి లెక్కలు చేతికందాయి. ఈ లెక్కలు ప్రకారం బొగ్గు ఉత్పత్తి 380లక్షల టన్నులని తేలింది. అందుకని ప్రభుత్వ రంగంలో వున్న గనులనుంచి 120 లక్షల టన్నులూ, ప్రైవేటు రంగం 100 లక్షల టన్నులూ అదనంగా ఉత్పత్తి చేయాలని ఇప్పుడు నిర్ణయించారు.

నూనె గనుల అన్వేషణకోసం 11 కోట్లను కేటాయించారు.

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయోత్పత్తుల అంచనాలు

న్యూఢిల్లీ, మే 16

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ సరకులను ఈ క్రింది విధంగా ఉత్పత్తి చేయాలని అంచనా వేశారు.

సరకు	1955-56 కి అంచనా వేసిన ఉత్పత్తి	అదనంగా చేయాలనుకున్న ఉత్పత్తి	1960-61 కి అంచనా వేసిన ఉత్పత్తి
		(పదిలక్షల టన్నులు)	
ఆహార పదార్థాలు	65.0	10.0	75.0
నూనె విత్తులు	5.5	1.5	7.0
చెరకు	5.8	1.3	17.1
		(పదిలక్షల బేళ్ళు)	
ప్రత్తి	4.2	1.3	5.5
జనపనార	4.0	1.0	5.0
		(లక్షల టన్నులు)	
కొబ్బరినూనె	1.3	0.8	2.1
పొగాకు	2.5	—	2.5
		(లక్షల మణుగులు)	
పక్కలు	22.0	5.0	27.0
లక్క	12.0	4.0	16.0
		(వేల టన్నులు)	
మిరియాలు	26.0	6.0	32.0
జీడిపప్పు	60.0	20.0	80.0
		(పదిలక్షల పౌనులు)	
తేయాకు	644.0	56.0	700.0

కేరళరాష్ట్రం అభివృద్ధి పట్ల కేంద్రం శీతకన్ను

రాజ్యసభలో కమ్యూనిస్టు నాయకుడు శ్రీ గోవిందన్‌నాయర్ నిశితవిమర్శ

న్యూఢిల్లీ, మే 16

కేరళరాష్ట్ర అభివృద్ధిపట్ల కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకోవడం లేదని నేడు రాజ్యసభలో తిరువాన్కూరు-కొచ్చిన్ బడ్జెట్ చర్చించిన సందర్భంలో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ గోవిందన్‌నాయర్ తీవ్రంగా విమర్శించారు.

శ్రీ గోవిందన్‌నాయర్ ప్రసంగిస్తూ, కేరళలో విద్యావంతులుగా వున్నవారిలో నిరుద్యోగసమస్య చాలతీవ్రంగా వున్నదన్నారు. ఈసమస్యను త్వరగా పరిష్కరించేందుకు సాహసంతో తగిన చర్యలను తీసుకోని పక్షంలో పరిస్థితులు మరింతగా విషమించే ప్రమాదం గలదని హెచ్చరిక చేశారు.

ఆయనింకా యిలా అన్నారు:

'ఏండ్లు గడచినకొద్దీ కాలేజీలనుండి హెచ్చుమంది పట్టభద్రులు బయటకు వస్తున్నారు. అందువలన ప్రస్తుతం కేరళలో వున్న హెచ్చు కాలేజీలను టెక్నికల్ కాలేజీలుగా మార్చడం అవసరం.

"రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసినప్పుడే ఈ నిరుద్యోగ సమస్య పరిష్కారమయ్యే అవకాశం వుంది. క్రిందటి ఎనిమిదేండ్లుగా కేంద్రం కేరళలో ఒక్క పారిశ్రామిక సంస్థనుకూడా నెలకొల్పలేదు. భారతదేశ ఐక్యతను కాపాడుకోవాలంటే మన దేశంలోని ప్రతిఒక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకోవాలి."

ఆ రాష్ట్రంలో పోలీసు అత్యాచారాలు ఇటీవల మితిమీరుతున్నాయనీ, వాటిని విచారించేందుకు ఒక పార్లమెంటరీ కమిటీని నియమించాలని శ్రీ నాయర్ డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రంలో నుండి వస్తున్న ఇలాంటి తీవ్రమైన ఆరోపణలపై దర్యాప్తును జరిపించేందుకు బదులుగా దేశవ్యవహారాల మంత్రి చిన్నచిన్న పోలీసు ఆఫీసర్లను సమర్థించడానికిపూనుకోవడం ఏ మాత్రం గౌరవప్రదంగా లేదని ఆయన స్పష్టంచేశారు.

శ్రీ పి. నారాయణ నాయర్ (కమ్యూనిస్టు - మద్రాసు) మాట్లాడుతూ, కేరళ ప్రాంతంలో కౌలుదారీ సంస్కరణలను అమలుజరపడం అవసరమన్నారు. ఆహార ధాన్యాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయనీ, వచ్చే మూడు మాసాల్లో ప్రజలు చాల కష్టపడవలసి వస్తుందనీ శ్రీ నారాయణనాయర్ పేర్కొన్నారు. వెంటనే చౌక డిపోలను నెలకొల్పకపోతే ప్రజలు నానాఅవస్థలు పడవలసి వస్తుందని చెప్పారు.

శ్రీ కె. భారతి (కాంగ్రెసు - కేరళ) మాట్లాడుతూ, కమ్యూనిస్టు సభ్యుల ప్రసంగాలు ఎన్నికల ప్రచారంగా కనబడుతున్నదన్నారు. కేరళలో నిజంగా వున్న ఇబ్బంది నిరుద్యోగ సమస్యనన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికవంతం చేస్తేనే గాని ఈ ఇబ్బంది తొలగదన్నారు. ప్రస్తుతానికి కుటీర పరిశ్రమలను విరివిగా స్థాపించి కొంతమందికైనా పని కల్పించడం అవసరమన్నారు.

ఆ తరువాత సభ గురువారానికి వాయిదా పడింది.

ఢిల్లీ-మద్రాసుల మధ్య జనతా ఎక్స్‌ప్రెస్

జూలై నుండి రోజూ నడిపే ఆలోచన

న్యూఢిల్లీ, మే 16

ఈ యేడాది జూలై మాసాన్నుండి ప్రతి దినమూ ఢిల్లీ-మద్రాసుల మధ్య జనతా ఎక్స్‌ప్రెస్‌లు నడిపే ఉద్దేశ్యం గలదని రైల్వేల ఉపమంత్రి శ్రీ అలగేశన్ లిఖితపూర్వకంగా రాయబారం వచ్చిన ముగ్గురుపార్లమెంటుసభ్యులతో తెలియజేశారు. ఢిల్లీ-మద్రాసు రైలు మార్గములోగల ప్రయాణాల రద్దీని గురించి వివరించేందుకుగాను పార్లమెంటు సభ్యులైన శ్రీ నాగప్ప చెట్టియార్, శ్రీ బాలసుబ్రహ్మణ్యం, శ్రీ యస్. యస్. నటరాజన్‌గార్లు రైల్వేమంత్రి లాల్ బహదూర్ శాస్త్రివద్దకూ, ఉపమంత్రి శ్రీ అలగేశన్ వద్దకూ రాయబారం వెళ్లారు. ఈ సందర్భంలోనే మంత్రులు తమ ఉద్దేశ్యాన్ని తెలిపారు.

ద్వితీయ పంచవర్ష ప్రణాళికకు అవుసరమైన పెట్టుబడి

◆◆◆

ఖమ్మంసభలో శ్రీ బి. టి. రణదివె ప్రత్యామ్నాయ సూచనలు

ఖమ్మం, మే 13

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక నిర్వాహణకు అవుసరమైన పెట్టుబడిని సేకరించేందుకు అఖిలభారత కమ్యూనిస్టు నాయకులు శ్రీ బి.టి. రణదివె, ఇచ్చట ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రత్యామ్నాయ సూచన చేశారు.

బహిరంగ సభకు ఖమ్మం పుర పాలకసంఘాధ్యక్షులు శ్రీ చిర్రావూరి లక్ష్మీనరసయ్యగారు అధ్యక్షత వహించారు. పట్టణంలోని మేధావులు, డాక్టర్లు, ప్లీడర్లేగాక సభకు ఇతర చోట్లనుండికూడా ప్రజలు వచ్చారు.

శ్రీ రణదివె తమ ఉపన్యాసం ప్రారంభించేదానికి ముందు తెలంగాణా పోరాటంలో ప్రాణా లర్పించిన వీరులకు జోహారు లర్పించారు. ఈ వీరుల ఆత్మబలిదానాలు వృధాకాలేదని, వారి పోరాటఫలితమే నేడు తెలంగాణాలో ప్రభుత్వం అమలు జరుపుతున్న భూసంస్కరణ లన్నారు. ఇలాంటి వీరులనుకన్న తెలంగాణాలో ఉపన్యసిస్తున్నందుకు శ్రీ రణదివె తమ సంతోషాన్ని ప్రకటించారు.

పాలఘాట్ మహాసభ చర్చలను వివరిస్తూ శ్రీ రణదివె, కమ్యూనిస్టు పార్టీలో చీలికలు వచ్చాయంటూ వ్యతిరేకులుచేసిన దుష్ప్రచారాన్ని ఖండించారు. కాంగ్రెసు ప్రభుత్వం తన విధానాలను మార్చుకొన్న ఫలితంగా కమ్యూనిస్టుపార్టీ కూడా పరిస్థితుల కనుగుణ్యంగా తన పాలసీలో మార్పు తీసుకొని వచ్చిందన్నారు.

ప్రభుత్వం శాంతి విధానాలను వివరించిన అనంతరం ద్వితీయ పంచవర్ష ప్రణాళికకు అవుసరమైన పెట్టుబడులను సమకూర్చుటలో ప్రభుత్వం ప్రజలపై పన్నులభారం వేయటాన్ని శ్రీ రణదివె నిరసించారు. ఇందుకు ప్రత్యామ్నాయ సూచనగా మనదేశంలో బ్రిటిషువారు తమ పెట్టుబడులపై సంపాదించే లాభాల్లోంచి కొంత మొత్తాన్ని ప్రణాళిక నిర్వహణకు తీసుకోవాలన్నారు. ఇదే విధంగా నైజాం నవాబు లాంటి కోటీశ్వరులవద్ద మూలుగుతూ ఉన్న ధనాన్ని కదిలించాలన్నారు.

ఆ తర్వాత శ్రీ రణదివె భూసంస్కరణలను త్వరగా ప్రవేశపెట్టాల్సిన అవుసరాన్ని వివరించారు. ఈ సంస్కరణలను త్వరితంగాను సక్రమంగాను అమలు పరిచేందుకు, ప్రణాళిక విజయవంతమయేందుకు కాంగ్రెసులోని దేశభక్తులంతా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

బహిరంగసభకుపూర్వం, ఉదయం ఊర్మిళానివాసంలో జిల్లాలోని కమ్యూనిస్టు కార్యకర్తల సమావేశం జరిగింది. వివిధ తాలూకాలనుండి 300 మంది కార్యకర్తలు సమావేశానికి హాజరయారు. సమావేశంలో శ్రీ రణదివె పార్టీ నాల్గవ కాంగ్రెసు రాజకీయ తీర్మానాన్ని వివరించారు. రెండవపంచవర్ష ప్రణాళిక లక్ష్యాలను, జాతీయ, అంతర్జాతీయపరిస్థితులను వివరించారు.

బహిరంగసభ అనంతరం [illegible] నృత్యప్రదర్శన నిచ్చింది. ఖమ్మం వైజ్ఞానిక దళం వారు బుర్రకథ చెప్పారు.

కడపజిల్లా పసుపు రైతుల ఇబ్బందులు

కడప, మే 16

పసుపు వాయిదా బేరగాళ్ళ చర్యల వల్ల కడప జిల్లా రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. సహకార బ్యాంకులుకాని, సహకారసంస్థలుకాని ఇంతవరకు కదలి పనిచేయలేదు. సహకార సంస్థలు కొంతమంది స్వార్థపరుల చేతులలో వుంటున్నాయి. రైతులు పండించిన సరుకు మార్కెటింగ్ సొసైటీలద్వారా కొనుగోలు చేయలేదు. అందుచేత రైతులకు పరపతి పుట్టక, పసుపుపంట ఫలితాన్ని అనుభవించ లేక పోతున్నారు.

స్థానిక వర్తకులు సేలలవారీగా సట్టా వ్యాపారాలు మొదలుపెట్టారు. గుజరాతీల, మార్వాడీల, చేతులలోనికి మార్కెట్టుపూర్ణంగా వెళ్ళుతున్నది.

ఈ జిల్లాలో ప్రధానమైనవ్యాపార పంటలలో పసుపు పంట ఒకటి. 1929 సంవత్సరం నుండి ఇక్కడి రైతులు పసుపుపంట పెడుతున్నారు. నూర్ల యకరాలు వేయడం, తీరా పసుపు చేతిలోనికి వచ్చాక ధర తరగడం, రైతులు నష్టపడటం, దివాళా తీయడం జరుగుతున్నది.

రైతులు పసుపుక్రింద తీసి దానిని వుడికించి కళ్లానికి వేసి ఎండబెడతారు. ఫిబ్రవరి ఆఖరువారం, మార్చి మొదటి వారంలో ఈ పని ప్రారంభిస్తారు. వారు అప్పటికే ఖర్చులు వగయిరాల కోసం బాకీలు చేసివుంటారు. ధర కొంచెం వస్తూందనగానే అమ్మడానికి మొదలు పెడతారు. రైతులదగ్గర సరుకు మార్కెట్టుకు వస్తూందని తెలియగానే వర్తకులు ధరను క్రిందకు దిగలాగివేసి కూర్చుంటారు. ధరవరలు వెంటనే పడిపోతాయని కొంతమంది రైతులు అదేసరకు అమ్ముకొంటారు. లేకపోతే బాకీదార్లు వత్తిడిచేస్తారు. ధరవచ్చేటంతవరకు సరుకును నిలుపుకొనే తాహతు వారికి వుండదు.

మే నెలవరకు పసుపును బయట వుంచవచ్చు. ఆ తరువాత బయట వుంచడానికి వీలులేదు. అలావుంచితే గాలిపురుగుపట్టి పుచ్చు తగులుతుంది. పుచ్చు తగలకుండా రసాయనికాలు వేసి, గాలిమారని గోదాములలో దాచాలి. ఇవన్నీ రైతులకు సాధ్యమయ్యేపనులు కావు. ఇన్ని యిబ్బందులతో కూడుకొన్నందువల్ల వారు పసుపు వాయిదా బేరగాళ్ళచేతుల్లో బలికావలసి వస్తున్నది.

జిల్లాలో సుమారు 750 టన్నుల వరకు పసుపు పండిస్తారు. ఎకరానికి రు 1000 లు ఖర్చు అవుతున్నది. ఖర్చు వివరాలు ఇవి పసుపు విత్తనం రు 360 లు; ఎరువు రు 100 లు; పిండి రు 140 లు, గొర్రెలమంద రు 50 లు; కలుపుతీత రు 100 లు, నీటి పాయడం రు 160 లు, తవ్వకం రు 120 లు, ఈ విధంగా ఖర్చుపెట్టి ఫలితం చేకూరుతుందని ఆశించే రైతులు నిరాశ చెందుతున్నారు. ఇప్పుడు పసుపునైన రూపాయకు అణా చొప్పున పన్ను వేస్తున్నారు. పుట్టికి రు. 12-8-0 లు, మండీల రుసుం రు 15 లు వేస్తున్నారు.

ప్రభుత్వం తూకపు పద్ధతి [illegible] మార్కెట్టు ఫీ వచ్చే విధంగా చూడాలి. తప్పుడుతూకాల బారినుండి కూడ రైతులను తప్పించాలి. మార్కెటింగు సొసైటీలద్వారా రైతుల సరుకు తీసి నూటికి 80 వంతులు రైతులకు ధనం చెల్లించి మిగతా ధనాన్ని ఇతర మార్కెట్టును బట్టి వప్పజెప్పాలి. అప్పుడే కొంతవరకైనా రైతులకు సహాయపడినట్లు అవుతుంది.

పుష్కరం రోజుల్లో శానిటరీ ఏర్పాట్లు

రాజమండ్రి మునిసిపల్ చైర్మన్ ప్రకటన

రాజమండ్రి, మే 15

గోదావరి పుష్కరం సందర్భంలో తగు విధంగా శానిటరీ ఏర్పాట్లు చేయబడ్డాయని రాజమండ్రి మునిసిపల్ చైర్మన్ శ్రీ పి. వీరభద్రరావుగారు తెలియజేస్తున్నారు.

రాజమండ్రిలో కలరా వుందని, చాలమంది ప్రాణాలు కోల్పోయారని పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో వ్యాపించిన వదంతులు ఎంత మాత్రమూ నిజంకావని వారు తెలియబరుస్తున్నారు. రాజమండ్రి పట్టణానికి రైలులోకాని, పడవలోకాని, రోడ్డు ద్వారాకాని వచ్చే ప్రయాణీకులు విధిగా ఇనాక్యులేషన్ చేయించుకో వలసివుంటుందని, ఇనాక్యులేషన్ సర్టిఫికెట్టు చూపెంచనిదే ఎవరిని రాజమండ్రిలోకి అడుగుపెట్టనివ్వరని తెలియజేస్తున్నారు.

మునిసిపల్ ఎన్నికల్లో ప్ర. సో. పార్టీ వైఖరి

ప్రధాన కార్యదర్శి వివరణ

విజయవాడ, మే 15

ఆంధ్ర మునిసిపల్ ఎన్నికల్లో తమ పార్టీ, రాజకీయాలతో ప్రమేయం లేని స్థానిక సంఘటనలను ఏర్పరచ డానికి ప్రయత్నిస్తుందని రాష్ట్ర ప్రజా సోషలిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ జి. సి. కొండయ్యగారు నేడొక ప్రకటనలో వివరించారు.

ప్రజా సోషలిస్టుపార్టీ దాదాపు 18 మునిసిపాలిటీలలోను, మైనరు, మేజరుపంచాయితీలు పెక్కింటిలోను పోటీ చేస్తుందన్నారు.

విజయవాడ, గుంటూరుమునిసిపల్ ఎన్నికలను వాయిదా వేయజూడటం నియంతృత్వం, అప్రజాస్వామికం అనిపించుకొంటుం దన్నారు.

భీమవరంమున్సిపలు ఎన్నికలు

భీమవరం, మే 14

భీమవరం మున్సిపాలిటీకి ఈ నెల 22, 23, 25 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేయాలని, స్క్రూటినీ 26 వ తేదీన జరుపబడుతుందని కమీషనరు శ్రీ టి. హెచ్. రంగారావుగారు ఇవాళ ఒక ప్రకటన చేశారు. అప్పీళ్ళు లేని సందర్భంలో 30 వ తేదీన అంతిమ లిస్టు ప్రకటించబడుతుందని, అప్పీళ్ళు ఉన్నచో నికర జాబితా జూన్ 4 వ తేదీన ప్రకటించబడుతుందని పేర్కొన్నారు. అదే ప్రకటనలో ఎన్నికలు జూన్ 26 వ తేదీన నిర్వహింపబడ్తాయని, ఓట్ల లెక్కింపు 27 వ తేదీన జరుగుతుందని వివరించబడింది.

సవరణ

ఈ నెల 12 వ తేదీ 'విశాలాంధ్ర' 9 వ పేజీలో 'పంచాయితీ ఎన్నికల ఫలితాలు' అను శీర్షిక క్రింద చించినాడ పంచాయితీ ఎన్నిక జరిగినట్లు పడింది. దానిని మేడపాడు పంచాయితీ ఎన్నికల ఫలితాలుగా సవరించి చదువుకోవాలని ప్రార్థన - సం.

తలమంచి బాలల సభ

తలమంచి, మే 15

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా తలమంచి గ్రామంలో ఇటీవల బాల సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. [illegible] ప్రదర్శనాలని, [illegible] వాలని నిర్ణయించారు. శ్రీ సూరిశెట్టి వెంకట[illegible] అధ్యక్షులుగా, శ్రీ [illegible] కార్యదర్శిగా [illegible] ఎన్నుకున్నారు.

ఖర్గపురం రైల్వే సమ్మె కొనసాగింపు

ఖర్గపురం, మే 14

ఖర్గపురం రైల్వేపనివారలు నేడు కూడ సత్యాగ్రహం కొనసాగించారు. అత్యావసర సిబ్బందితప్ప మిగతా శాఖల వారందరూ సత్యాగ్రహంలో పాల్గొన్నట్లు తెలిసింది.

స్థానిక రైల్వే వ్యాగన్ షాపులోని 112 గురు రఫ్ సిమెంటర్లను అక్రమంగా పనినుండి తొలగించినందువల్ల ఈ సత్యాగ్రహం ఈనెల 8వ తేదీ నుండి జరుగుతున్నది.

నిన్న, మొన్న కార్ఖానా సెలవులు అయినందువల్ల విశేష సంఘటన లేవీ జరగలేదు. నిన్న సాయంత్రం రన్నింగ్ స్టాఫ్, పోర్టర్లు, మొదలగు సిబ్బంది వున్న ప్రాంతంలో ఒక బహిరంగ సభ జరిగింది. కార్మికుల కోర్కెలను బలపరుస్తూ శ్రీ సుబ్రహ్మణ్యం, శ్రీ ఎం. ఎస్. రావు ప్రభృతులు మాట్లాడారు. సంప్రతింపులద్వారా సమస్యలను పరిష్కరించుకోడానికి కార్మికులు ఇప్పుడుకూడ సిద్ధంగా వున్నారని వక్తలు స్పష్టం చేశారు. (వి. వి.)

'శ్రీ డాంగేను విడుదల చేయాలి'

వెంకట్రాజుపాలెం, మే 15

సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో అరెస్టు అయిన శ్రీ ఎస్. ఎ. డాంగేను బేషరతుగా విడుదల చేయాలని కోరుతూ ఒంగోలు తాలూకా వెంకట్రాజుపాలెం గ్రామ కమ్యూనిస్టుకమిటీ సమావేశంలో తీర్మానించారు.

నాలుగైదు గ్రామాలకు కలిపి ఒక ఆస్పత్రి నిర్మించాలని, ఒక డాక్టరును, ఒక నర్సును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఆంధ్రరాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ మహాసభ

గుంటూరుఏకాదండయ్యపంతులుహాల్లో ఈ నెల 19, 20, 21 తేదీలలో ఏర్పాటు

గుంటూరు, మే 17

ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ ఆరవ మహాసభ గుంటూరు పట్టణంలో శ్రీ ఏకా దండయ్య పంతులుగారి హాలులో ఈ నెల 19, 20, 21 తేదీలలో జరుగుతుంది.

మహాసభాధ్యక్షులుగా మద్రాసు మాజీ విద్యామంత్రి డాక్టరు ఎం. వి. కృష్ణారావుగారు, ప్రారంభకులుగా ఆంధ్ర స్థానికశాఖామంత్రి డాక్టరు ఎ. బి. నాగేశ్వరరావుగారు, బహిరంగ సభ ప్రారంభకులుగా ఆంధ్ర వ్యవసాయశాఖామంత్రి శ్రీ కందుల ఓబుల రెడ్డిగారు ఆహ్వానింపబడ్డారు.

రాష్ట్రం మొత్తంమీద దాదాపు వెయ్యిమంది ప్రతినిధులు ఈ మహాసభకు ఎన్నుకోబడ్డారు. వందలాది ఉపాధ్యాయులు మహాసభకు హాజరు కావడానికి వుత్సాహ పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఈ మహాసభతోపాటు వైజ్ఞానిక సభకూడా ఏర్పాటు చేయబడింది. శ్రీ బంగా కనకలింగేశ్వరరావుగారు అధ్యక్షత వహిస్తారు. 'పద్మశ్రీ' స్థానం నరసింహారావుగారు ప్రారంభిస్తారు.

నాటికలు, విచిత్రవేషాలు, హరికథలు, బుర్రకథలు, నృత్యాలు, వాయిద్యాలు, వ్యాయామ ప్రదర్శనలు యీ వైజ్ఞానిక ప్రదర్శనాలలో వున్నాయి. మహాసభజరిగే ఈ మూడు రోజులు ప్రతిరోజూ 9 గంటలనుండి 12 గంటలవరకు జరుగుతాయి.

విద్యా విషయిక వస్తు ప్రదర్శనం కూడా ఏర్పాటు చేయబడింది. దీనికి అధ్యక్షులుగా [illegible] స్పెషల్ ఆఫీసరు శ్రీ ఎన్. భగవాన్‌దాసుగారు, ప్రారంభకులుగా శ్రీ [illegible] గారు వుంటున్నారు. [illegible] జిల్లాలనుండి రకరకాలైన వస్తువులు ప్రదర్శనానికి రాబోతున్నాయి.

ఆధునిక విద్యావిధానంపై ప్రముఖ విద్యావేత్తల అభిప్రాయ వేదిక [illegible]. [illegible] శ్రీ [illegible], శ్రీ [illegible] పాల్గొంటున్నారు.

వాగ్ధోరణిలో శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, శ్రీ ఉంధ్యాల పాపయ్యశాస్త్రి, శ్రీ వి. వి. కృష్ణారావు, శ్రీ కె. సుబ్బారావుగారలు పాల్గొంటున్నారు.

దేశదేశాలనుండి సందేశాలు

మహాసభకు చైనా, రష్యా, అమెరికా, పోలెండ్ మున్నగు దేశాల విద్యాసంస్థలనుండి, ప్రపంచ ఉపాధ్యాయ సమాఖ్య, పారిస్‌నుండి భారత దేశంలోని అనేక రాష్ట్రాల విద్యాసంస్థలనుండి, అనేక మంది ప్రముఖులనుండి శుభాకాంక్షలు తెలియజేస్తూ సందేశాలు వచ్చాయి.

మహాసభను విజయవంతంగా నిర్వహించడానికి గుంటూరు పట్టణంలో సన్నాహాలు, మహాసభ యేర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. దాదాపు 5000 రూపాయలకు పైగా విరాళాలు యిప్పటికే వసూలైనట్లు అంచనాలు వచ్చాయి. ఆహ్వానసంఘ కమిటీ సభ్యులైన శ్రీ నడింపల్లి నరసింహారావు, శ్రీ వై. వి. పున్నయ్యశాస్త్రి, శ్రీ కొమ్మారెడ్డి వెంకటరెడ్డి, శ్రీమతి జాస్తి సీతామహాలక్ష్మమ్మ, శ్రీ ఎస్. వి. యల్. నరసింహం వగయిరా పెద్దలు సన్నాహాకృషిలో చురుకుగా పాల్గొని మహాసభను జయప్రదం చేయడానికి కృషి చేస్తున్నారు.

బల్లిపాడు సారస్వత సంఘ వార్షికోత్సవం

బల్లిపాడు, మే 14

తెనాలి తాలూకా బల్లిపాడు సారస్వత సంఘ వార్షికోత్సవము 12 వ తేదీ శ్రీ [illegible] అధ్యక్షతను జరిగింది. కార్యదర్శి నివేదిక [illegible] శ్రీయుతులు పి. [illegible] రావు, [illegible] లయ్య, పి. లక్ష్మీనారాయణమూర్తిగార్లు ప్రసంగించారు.

పంచాయితీ ఎన్నికల ఫలితాలు

నందికొట్కూరు, మే 15

కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకా నాగటూరు పంచాయితీ బోర్డుకు ఈ క్రింది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయారు.

శ్రీయుతులు [illegible] లక్ష్మిరెడ్డి, చిన్న బాలయ్య, హనుమంతరావు, వెంకటచలమయ్య, గోశిరెడ్డి, అయిలన్న, తలారి పెద్దస్వామన్న గారలు.

కొణిదెల

నందికొట్కూరు తాలూకా కొణిదెల పంచాయితీబోర్డుకు ఈ క్రింది అభ్యర్థులు పోటీలేకుండా ఎన్నికయారు.

శ్రీయుతులు చల్లా రామిరెడ్డి, చిన్న నాగిరెడ్డి, నాగిరెడ్డి, టి. వెంకటరెడ్డి, స్వామన్న, మొల్ల ఉమర్ సాహెబు, జి. నరసింహాయ్య గార్లు.

శివదేవుని చిక్కాల

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురం తాలూకా శివదేవునిచిక్కాల పంచాయితీ బోర్డుకు ఈ క్రింది అభ్యర్థులు పోటీలేకుండా ఎన్నికయారు.

శ్రీయుతులు మంతెన సూరపరాజు, బత్తుల పౌలు, వడ్డి చిన వెంకటస్వామి నాయుడు, మేకామీరయ్య, కుక్కల సుబ్బారావు, అయ్యన్న, యింటా గునుపూడి వెంకటరత్నం గారలు.

శేరేపాలెం

నర్సాపురం తాలూకా శేరేపాలెం గ్రామ పంచాయితీబోర్డుకు ఈ క్రింది వారు ఎన్నికయారు

శ్రీయుతులు గూడూరు కృష్ణమూర్తి, తణుకుల వీరాస్వామి, తోడగాని మాణిక్యం, కొత్తపల్లి శ్రీరామమూర్తి, మైలాబత్తుల వెంకన్న, లోకం సుబ్బారావు, కొత్తపల్లి గంగరాజుగార్లు.

తిర్లపూడి

నర్సాపురం తాలూకా తిర్లపూడి గ్రామ పంచాయితీ బోర్డుకు ఈ క్రింది అభ్యర్థులు ఎన్నికయారు

శ్రీయుతులు ఈమన వీరాస్వామి, చేగొండి నర్సింహమూర్తి, నడపన బసవయ్య, దిగుపాటి వెంకన్న, యాదగిరి నర్సింహరావు, దిడ్లఅప్పలు, యింటి సూరయ్యగార్లు.

బల్లిపాడు

నర్సాపురం తాలూకా బల్లిపాడు గ్రామ పంచాయితీకి ఈ క్రింది అభ్యర్థులు ఎన్నుకోబడ్డారు.

శ్రీయుతులు భూపతిరాజు నారాయణరాజు, వేగిసిన సూర్యనారాయణ రాజు, కాటూరి వెంకయ్య, దుండి గంగయ్య, దండు వెంకట నర్సింహరాజు, కాగిత పుల్లయ్యగారలు.

నవరసపురం

నర్సాపురం తాలూకా నవరసపురం గ్రామ పంచాయితీ ఎన్నికలు ఏప్రిల్ 30 వ తేదీన జరిగాయి. అడ్డాల కృష్ణమూర్తి, కారాడి వెంకటేశ్వరరావు, వుండ్రు దేవసహాయం, యూద యోహాను, జీవదాల ఏసుదాసు, యీద చినరెడ్డిగార్లు ఎన్నుకోబడ్డారు. పోటీ లేదు.

పెద మామిడిపల్లి

నర్సాపురం తాలూకా పెద మామిడిపల్లి గ్రామ పంచాయితీ ఎన్నికలు మే 13 తేదీన జరిగాయి. శ్రీయుతులు బండి నర్సింహమూర్తి, బండి మంగారావు, పరిం సుబ్బారావు, పాముల ప్రసాదరావు, నారాయణమూర్తి, బండి పేములు గారలు ఎన్నుకోబడ్డారు. పోటీలు లేవు.

చెరుకూరు

నెల్లూరుజిల్లా కందుకూరుతాలూకా చెరుకూరు పంచాయితీ బోర్డుకు ఈ క్రిందివారు పోటీలేకుండానే ఎన్నుకోబడ్డారు.

శ్రీయుతులు నూకతోటి ముసలయ్య (మెహర్యాబుకాట్టు - సుంకిరెడ్డిపాలెం), చెరుకూరు సుబ్బరాయుడు (రామన్నపాలెం), ముల్లిమూరి శ్రీరాములు (వెంకుపాలెం) గార్లు.

1, 2 వార్డుల్లో పోటీ జరిగింది. మొదటి వార్డుకు శ్రీయుతులు అనుమోలు కోటయ్య, నేలపాటి నాయుడు, నలమోతు వెంకట సుబ్బయ్యగార్లు, రెండవ వార్డుకు శ్రీ ముల్లమూరి లక్ష్మయ్యగారు ఎన్నికయారు.

నియమిత కాలంలోగా నామినేషన్ రానందున మరొక స్థానానికి (తిమ్మపాలెం) బైఎలక్షన్ జరుగవలసి ఉన్నది.

భట్టుమగుటూరుకు కొత్తపంచాయితీ

గ్రామ ఐక్యకమిటీ కృషివల్ల పోటీలేకుండా సభ్యుల ఎన్నిక

మార్టేరు, మే 15

తణుకు తాలూకా భట్టుమగుటూరులో ఈ నెల 12 వ తేదీన కొత్త పంచాయితీ ఏర్పడింది. గ్రామ ఐక్యకమిటీ కృషివల్ల పోటీలేకుండా ఎన్నికలు జరిగాయి. ఈక్రింద పేర్కొన్నవారు పంచాయితీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

శ్రీయుతులు కోలభట్టు సుబ్బరాజు, పూడిమూడి అప్పలనరసింహరాజు, శ్రీరాముల నాగన్న, [illegible], [illegible] చిట్టెయ్య, కటికతిల వెంకన్న, కటికతిల సోమన్‌రాజు, కొల్లి [illegible] రాఘవంగార్లు.

నెల్లూరు మోటారు కార్మికులకు బోనస్

నెల్లూరు, మే 15

నెల్లూరు యం బి యస్. మోటారు [illegible] కార్మికులకు 1951 నుండి సంవత్సరానికి 15 రోజుల జీతాన్ని [illegible] అలవెన్సులతోటి ఇచ్చారు. ఇంక్రిమెంట్లు, [illegible] జీతాలతోటి [illegible] మేనేజ[illegible] [illegible] వాగ్దానం చేశారు.

వీరమాత శ్రీమతి బసవమ్మ మృతి

విజయవాడ, మే 16

మృతవీరులు చలసాని [illegible]రావుగారి తల్లి, చలసాని శ్రీనివాసరావుగారి [illegible] అయిన బసవమ్మగారు ఈనెల 11 వ తేదీరాత్రి చనిపోయారు.

ఆమె చనిపోయే ముందు కమ్యూనిస్టుపార్టీ నిధికి రు. 10-0-0 లు యివ్వమని కుమారులతో చెప్పారు. ఆమె మాట ప్రకారం వారు పార్టీనిధికి రు. 10-0-0 లు చందా పంపించారు.

మృతదేహాన్ని ఎర్ర జెండాలతో తీసుకవెళ్ళారు. దహన ప్రదేశంలో ఎర్రజెండా ప్రతిష్ఠాపన చేశారు.

నిర్ణీత సంఖ్యా పేరిట పంతుళ్ల తగ్గింపు

నెల్లూరుజిల్లా ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం నిరసన

నెల్లూరు, మే 15

నిర్ణీత సంఖ్య పేరుతో ఉపాధ్యాయుల సర్వీసును నిలుపుదల చేయకుండా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ నెల్లూరుజిల్లా ప్రాథమికోపాధ్యాయ సమావేశంలో తీర్మానించారు.

నెల్లూరు అత్తలోటఅగ్రహారంలో ఈ సమావేశం జరిగింది. శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగారు అధ్యక్షత వహించారు.

శ్రీ పి. కొండయ్యగారు అధ్యక్షులుగా, శ్రీ కె. తిరుపాల్‌గారు కార్యదర్శిగా జిల్లాసంఘం ఎన్నుకోబడింది. రాష్ట్ర కౌన్సిలర్లుగా పదకొండుమంది ఎన్నుకోబడ్డారు.

పశువులకు జాడ్యం

పోకగుడపాడు, మే 15

నెల్లూరు జిల్లా కావలి తాలూకా పోకగుడపాడులో పశువులకు జాడ్యం తగిలింది. ఒక ఎద్దు, రెండు అవులు చనిపోయాయి.

పారిశ్రామిక, వాణిజ్యశాఖ

ఆంధ్ర

శ్రీ శాస్త్రీస్ పెన్‌వర్క్సు, తెనాలి వారు యిచ్చట అనుసరింపబడు 1922, మద్రాసు స్టేట్ ఎయిడ్‌టు ఇండస్ట్రీస్ ఆక్టు (ఆక్టు V ఆఫ్ 1923) చట్టముక్రింద తమ ఋణములను తీర్చుకొనుటకున్నూ, కొత్త యంత్ర పరికరములను కొనుగోలు చేయుటకున్నూ, పెట్టుబడి అభివృద్ధికిన్నీ ఆంధ్ర ప్రభుత్వమునకు రు 75,000/- (డెబ్భై ఐదువేల) ఋణమునకు, ఇదివరకే తాకట్టు పెట్టబడిన తమ ఆస్తులను అనగా నివాసగృహము, వర్కుషాపు, 880 చ. అడుగుల స్థలముతో సహా, ప్రస్తుతపు మిషనరీ యావత్తు మీద దరఖాస్తు చేసియున్నారని యిందు వెంట నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఋణము మంజూరు చేయుటలో యెవరికిగాని యెట్టి ఆక్షేపణలైన ఉన్న యెడల అట్టివారు డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్సు ఆంధ్ర, 20, ఆలివర్ రోడ్, మద్రాసు4 వారికి, తమ పేరు పూర్తి అడ్రసుతో తమకుగల ఆక్షేపణలు స్పష్టముగా వివరిస్తూ తాము స్వయముగా హాజరై ఆక్షేపణలు వివరించి తెలుపుకొనగోరెదమని యీ నోటీసు ప్రకటింపబడిన ముప్పది రోజులలోగా డైరెక్టరుగారికి చేరునట్లు తమ అభిక్షేపణ నోటీసు అందచేయవలెను. ఆక్షేపణలు ఏవైనా వున్నయెడల, డైరెక్టరుగారిచే తమ ఆఫీసునందు తరువాత నిర్ణయింపబడి, ఆక్షేపణదారుకు తెలుపబడు తేదీనాడు విచారింపబడును.

డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ &
కామర్సు, ఆంధ్ర.

మదరాసు మునిసిపల్ ఆక్టు 98, 104, 105, మరియు 107 సెక్షనుల క్రింద

నోటీసు

(1) 1-4-56 నుంచి 30-9-56 వరకు లైసెన్సు కాలము ప్రతి వాహనమునకు నెంబరుగల రేకుబిళ్ళ యివ్వబడును. ఈ గుర్తువున్న వాహనమే మునిసిపల్ లైసెన్సు పొందినట్లుగా పరిగణించబడును. వీటిలో ఏ గుర్తు పోయినను సదరు వాహనముయొక్క ఖామందు వెంటనే ఆఫీసునకు తెలియజేసి ఒక అణా చెల్లించి పోయిన గుర్తు తిరిగి వేయించుకొనవలయును. అట్టి గుర్తులేని వాహనము టౌనులో తిరుగునప్పుడు పట్టుకొనబడును.

(2) వాహనములుగల ఖామందులు చెల్లించవలసిన ఫీజు ఆఫీసులో తగు చెలానాపైని వ్రాసి జమకట్టవలయునేగాని రోడ్డుపైన కనబడు ప్రతి ఉద్యోగికి డబ్బు యివ్వకూడదు. ఆ ప్రకారము డబ్బు యిచ్చిన యెడల మునిసిపల్ అధికారులు జవాబుదారి కాబడరు. అట్టి ఖామందు డబ్బు తిరిగి యివ్వవలసియున్నది. కావున ఈ విషయము జాగ్రత్తగా గమనించి డబ్బు సరాసరి ఆఫీసులోనే జమకట్టవలసినదిగా హెచ్చరించబడమైనది.

(3) పై తెలుపబడిన రీతిగా వాహనముల ఖామందులు 104 వ సెక్షన్ ప్రకారము 1-6-1956 తేదీలోగా తమ వాహనములకు లైసెన్సుపొంది నెంబర్లు వేయించుకొనవలయును. అట్లు లైసెన్సుపొందక నెంబర్లు వేయించుకొనని యెడల సదరు వాహనములు మునిసిపల్ అధికారులవల్ల 107 సెక్షను ప్రకారము పట్టుకొనబడును. గాన యిట్టి ఖామందులు తగుచర్య తీసుకొనవలసినదిగా హెచ్చరించబడమైనది.

మునిసిపల్ ఆఫీసు,
విజయవాడ.
9-5-1956

వై. గురురెడ్డి,
మునిసిపల్ కమీషనర్,
విజయవాడ.

రేడియో

మే 19 శనివారం

విజయవాడ: (357.1 మీటర్లలో) ఉదయం.
6-50 స్వాగతము;
6-55 ప్రసారవిశేషాలు;
7-0 తెలుగున వార్తలు;
7-15 ఉదయగానం;
7-30 బొమ్మరిల్లు;
8-0 ఆంగ్లమున వార్తలు
1-0 వనితావాణి;
1-30 గీతావళి,
1-40 హిందీలోవార్తలు
1-50 తెలుగున వార్తలు
5-30 నాదస్వరం;
6-0 స్థానిక ప్రకటనలు;
6-5 ప్రాంతీయవార్తలు;
6-15 గ్రామస్థులకు;
7-0 తెలుగున వార్తలు;
7-15 ఏకపాత్రాభినయం
7-30 కల్పలత,
8-0 సంకీర్తనం,
8-30 రేడియోన్యూస్
8-40 బుద్ధుని అడుగు జాడలలో- అశోకుడు ప్రసంగం;
9-0 ఆంగ్లమున వార్తలు
9-15 [illegible],
9-30 [illegible],
10-0 సమాప్తి

మద్రాసు బి. (211.3 మీటర్లలో) ఉదయం
6-50 స్వాగతం;

7-0 తెలుగున వార్తలు,
7-15 ఉదయగానం;
7-30 బొమ్మరిల్లు;
8-0 ఆంగ్లమున వార్తలు,
1-0 గీతమాలిక;
1-30 ఆంగ్లమునవార్తలు
1-40 గానమంజరి,
1-50 తెలుగున వార్తలు
2-0 వీణ
2-15 శివునకు నివేదన (తమిళము)
5-30 వీణ
5-50 స్థానిక ప్రకటనలు;
6-0 ఆంగ్లమున వార్తలు
6-5 ప్రాంతీయవార్తలు
6-15 గ్రామస్థులకు,
7-0 తెలుగున వార్తలు,
7-15 ఏకపాత్రాభినయం
7-30 నాటిక (తమిళం)
8-30 [illegible],
8-40 [illegible]
9-0 ఆంగ్లమున వార్తలు;
9-15 ప్రసంగం;
9-30 [illegible],
10-30 సమాప్తి

హైద్రాబాద్: (411.0 మీటర్లలో) ఉదయం
6-50 సుప్రభాత్;
6-55 కార్యక్రమవివరణ
7-0 తెలుగున వార్తలు;
7-15 ఉదయగానం;
7-45 కన్నడ వార్తలు;
8-0 ఆంగ్లమున వార్తలు;
8-15 హిందీలో వార్తలు
8-30 ఫిలిమ్, గీత్;
12-30 రాగ్ మాధురీ;
12-50 మరాఠీ వార్తలు
1-0 ఎస్. ఎస్. రత్న;
1-30 చిత్రమాలిక;
1-50 తెలుగున వార్తలు
5-30 గీతావళి
5-45 సంగుల శ్రీరామమూర్తి
6-0 పి. కార్యక్రమం;
6-30 [illegible];
6-40 స్థానిక ప్రకటనలు
6-45 గ్రామసీమ;
7-0 తెలుగున వార్తలు;
7-15 గ్రామసీమ;
7-45 గీత్, ఫిలిమ్;
8-0 ఆంగ్ల ప్రసంగం,
8-30 [illegible];
8-40 [illegible],
9-0 ఆంగ్లమున వార్తలు;
9-15 ఉర్దూలో వార్తలు
9-30 [illegible];
11-0 సమాప్తి.

పునర్దర్శనం:

నాగార్జున సాగరం
(గేయకావ్యం)
రచన: సి. నారాయణరెడ్డి
116 పేజీలు — వెల: 1-8-0
(పోస్టేజి అదనం)
సోల్ డిస్ట్రిబ్యూటర్స్.
విశాలాంధ్ర ప్రచురణాలయం
ఒంగోలుహోటల్ బిల్డింగ్స్ : విజయవాడ - 2
ది పీపుల్స్ బుక్ హౌస్
నిజాంషాహిరోడ్ : హైద్రాబాద్ [దక్కన్]

విచక్షణారహితంగాజీవిత భీమా ఏజంట్ల తొలగింపు

జరుగుతున్నట్లు లోక్‌సభలో పలుపురుసభ్యుల విమర్శ

న్యూఢిల్లీ, మే 16

జీవిత భీమాను జాతీయం చేసిన తరువాత ఏజంట్లను తదితరులను విచక్షణా రహితంగా తీసివేస్తున్నట్లు నేడు లోక్‌సభలో పలువురు సభ్యులు ఆందోళనను వెలిబుచ్చారు.

రెవెన్యూ, పౌరవ్యయం శాఖా మంత్రి శ్రీ ఎమ్. సి. షా ఇందుకు సమాధానం చెబుతూ ఇటువంటివారి విషయంలో సాధ్యమైనంత ఎక్కువ సానుభూతితో చూడాలని జీవిత భీమా కంపెనీల కస్టోడియన్లకు ఆదేశాలు పంపినట్లు తెలియజేశారు.

జీవితభీమావ్యాపారాన్ని జాతీయం చేయడంవల్ల ఏజంట్లు, తదితరులు తాము చేయవలసినంత వ్యాపారాన్ని చేయలేని పక్షంలో అటువంటివార ఉద్యోగాలు తీసివేయరు: వీరు చేయవలసిన వ్యాపారంలో చెప్పుకోదగినంత పెద్దలోటు ఏర్పడిన పరిస్థితిలో మాత్రమే తీసివేస్తారు.

ఎంతమంది భీమా పనివారి ఉద్యోగాలను తీసివేస్తూ ప్రభుత్వం నోటీసులు జారీచేసింది? ఎంతమంది విషయంలో పరిశీలన జరిపింది? అన్న ప్రశ్నలకు శ్రీ ఎమ్. సి. షా జవాబు యిస్తూ ఏజంట్లు తదితరులు (ఫీల్డు వర్కర్లు) ఇతర రంగాలలోవలె జీతాలందుకునే ఉద్యోగులు కారని అన్నారు. భీమావ్యాపారాన్ని చేయడానికి నిర్ణీత షరతులతో వారిని కంపెనీలు కుదుర్చుకుంటాయనీ, వారు చేసిన వ్యాపారాన్నిబట్టి వారికి ముట్టజెప్పే డబ్బును ముడిపెడతారని అన్నారు. నిర్ణీత పరిమితిలో ఏజంటు వ్యాపారం చూపని పక్షంలో వారికిచ్చే డబ్బును ఆపివేయడానికి, వాయిదా వేయడానికి, తగ్గించడానికి కంపెనీలకు అధికారం ఉందన్నారు.

"అందుచేత కంపెనీల కస్టోడియన్లు ఇటువంటి సందర్భాలలో తీసుకొనే చర్యలకు ప్రభుత్వ అనుమతిని ముందుగా పొందనవసరం లేదు. ఇటువంటి కొన్ని ఘటనలు ఇటీవల జరిగినట్లు తెలుస్తున్నది. ఏజంట్లుగాని, భీమా కంపెనీల పనివారల సంఘాలుగాని ఏజంట్లను అన్యాయంగా తొలగించినట్లు డబ్బు తగ్గించినట్లు చేసిన అరవై ఫిర్యాదులు మాత్రమే ప్రభుత్వానికి అందాయి. ఇందులో 31 కేసుల గురించి విచారణ పూర్తి అయింది. వీటిల్లో అన్యాయం ఏమీ జరగలేదని ప్రభుత్వం సంతృప్తి పడింది.

శ్రీ రాధారమణ. ఏజంట్లు సంపాదించుకున్న ఇంక్రిమెంట్లను నిలిపివేసిన మాట వాస్తవమా?

శ్రీ షా: లేదు. వారికి ఇంక్రిమెంట్లు వచ్చిఉంటె, జీతాలురావలసి ఉంటే వారు పూర్తిచేయవలసిన వ్యాపారం పూర్తిచేసిన స్థితిలోవాటిని నిలిపివేయలేదు.

శ్రీ హీరేన్‌ముఖర్జీ: ఈ విషయంలో అనేక ఫిర్యాదులు వస్తున్నందున జీతాలు తదితర విషయాలను జాగ్రత్తగా పరిశీలించేంతవరకు ప్రభుత్వం ఈ వ్యవహారాలను ఎట్టిమార్పు లేకుండా యథాస్థితిలోనే ఉంచాలన్న సూచనను పరిశీలిస్తుందా?

శ్రీ షా: జీతాలను చెల్లించలేదన్న సమస్యేలేదు. నిర్ణీతమైన వ్యాపారాన్ని చూపించాలన్న షరతుపై నియమించబడిన నిర్ణీతషరతులకు చెందినఉద్యోగులకు ఈ సమస్య సంబంధించినట్టిది. నిర్ణీతమైన వ్యాపారాన్ని చూపని పక్షంలో ఆ మేరకు డబ్బును మినహాయిస్తారు.

శ్రీ కేంప్టన్ గత మూడు నెలలుగా ఏమీ జీతాలు అందని ఇటువంటి ఉద్యోగులు కొందరున్నారు. వీరు వ్రాసిన ఉత్తరాలకు కస్టోడియన్లు జవాబుకూడా యివ్వలేదు.

శ్రీ షా. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వ్యక్తిగతంగా మేము వెంటనే విచారణ జరుపుతున్నాం. సభ్యుని వద్దఉన్న సమాచారం చెబితే ఆ విషయం కనుక్కుంటాను.

శ్రీ వి. పి. నాయర్: ఉద్యోగాలనుండి మొత్తం తీసివేయబడిన అన్ని తరగతుల ఉద్యోగులసంఖ్య ప్రభుత్వానికి తెలుసునా?

శ్రీ షా: గౌరవనీయ సభ్యుడు ఏజంట్లు, కార్యాలయోద్యోగులమధ్య వివక్షత గుర్తించడంలేదు. కార్యాలయోద్యోగుల కెవర్నైనా తీసివేస్తే మేము వెంటనే విచారణచేస్తామని హామీయిచ్చాం.

శ్రీ ఏ. కె. గోపాలన్. ఒక కంపెనీలో ఒకవారంక్రితం మొత్తం 16 మంది ఉద్యోగులకు 13 మందిని బర్తరఫ్ చేసిన సమాచారం ప్రభుత్వానికి తెలుసువా?

శ్రీ షా: వివరాలు చెబితే కనుక్కుంటాను.

శ్రీ సి. పి. మత్తన్. ఎంతమంది భీమా కస్టోడియన్లకు ప్రత్యక్షానుభవం ఉంది? ఎంతమంది పడకకుర్చీ తరగతికి చెందినవారు?

శ్రీ షా. అందరికీ తగినంత అనుభవం ఉంది.

* * *

అమెరికన్ గోధుమల కొనుగోలు

లోక్‌సభలో ప్రశ్నలకు ఉపమంత్రి సమాధానం

న్యూఢిల్లీ, మే 16

దేశంలో బియ్యం, గోధుమల ధరలు తగ్గిపోతున్నవని, ఒక నెలలో అవి "సరసమైన స్థాయి"కి రాగలవని ఆహారశాఖ ఉపమంత్రి శ్రీ యం. వి. కృష్ణప్ప నేడు లోక్‌సభలో ప్రకటించారు.

అమెరికన్ అదనపు గోధుమల కొనుగోలుగురించి, భారత ప్రభుత్వ ప్రతినిధులకు, ఢిల్లీలోని అమెరికన్ రాయబార కార్యాలయాధికారులకు సంభాషణలు జరిగాయని ఉపమంత్రి చెప్పారు. మనం ఎంత గోధుమ కొంటాం, వాటిధర ఎలావుంటుంది అనే విషయాలపై, ఇంకా నిర్ణయాలకు రాలేదన్నారు.

అమెరికన్ గోధుమలను ఇండియా ఎందుకు కొనదలచింది అనే ప్రశ్నకు జవాబు చెబుతూ, 10 లక్షల టన్నుల చౌకబియ్యం, గోధుమలస్టాకులను ప్రభుత్వం నిర్మించదలచిందన్నారు. ఇప్పటికే అమెరికానుంచి మూడు లక్షల టన్నుల గోధుమలు కొన్నామని, మరొక మూడులక్షలు టన్నులను ఆస్ట్రేలియా నుంచి కొంటామని అన్నారు.

శ్రీ సాధన గుప్త అమెరికాతో ఇదివరలో మనం గోధుమల కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నపుడు నష్టపడ్డాం. అమెరికా సరఫరా చేసిన గోధుమలలో చాలభాగం, వినియోగానికి పనికిరావని తేలింది. ఇలాంటి వ్యవహారం మళ్ళీ జరగకుండా జాగ్రత్త పడుతున్నారా?

శ్రీ కృష్ణప్ప అంతర్జాతీయ గోధుమ ఒప్పందం క్రింద మన మెప్పుడూ నష్టపడలేదు. ఇక వ్యాపారం విషయంలో మనం ఇతర దేశాలతో బేరమాడగలిగే స్థితిలో వున్నాం. మన పరిస్థితి మునుపటంత అధ్వాన్నంగా లేదు.

* * *

లోక్‌సభ వచ్చే సమావేశం తేదీ

ప్రధానమంత్రి సూచన

న్యూఢిల్లీ, మే 16

లోక్‌సభ తొమ్మిదవ సమావేశం ఇదివరకు అనుకున్నదానికంటె మూడు రోజుల ముందే జరుగుతుందని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో సూచించారు.

అయితే వచ్చే సమావేశం ప్రారంభమయ్యే తేదీని ఇంకా నిర్ణయించలేదు. ఇంతకుముందు జూలై 10వ తేదీన సమావేశం కాగలదని తెలిపారు. బహుశా ఆ తేదీకి మూడురోజుల ముందు, లోక్‌సభ సమావేశం ప్రారంభం కాగలదను కుంటున్నారు.

పంచవర్ష ప్రణాళికపై చర్చను రెండుభాగాలుగా విభజించుతారు. సాధారణ చర్చను ఈ సమావేశంలో పూర్తిచేసి వివరాలపై చర్చను వచ్చే సమావేశానికి వాయిదావేస్తారు.

ఢిల్లీలో బుద్ధ జయంతి ఉత్సవాల ప్రారంభం

ఢిల్లీ, మే 15

బుద్ధ జయంతి ఉత్సవాలు ప్రారంభించిన సందర్భంలో నేడిక్కడ ఒక పెద్ద బహిరంగసభ జరిగింది.

లోక్‌సభ స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగార్ గౌతమబుద్ధుని బోధనల ప్రాధాన్యతను గురించి సభలో ఉపన్యసించారు.

ఉత్సవాలు ఢిల్లీ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యాన జరుగుతున్నాయి.

బహిరంగసభకు ముందు స్కూలు విద్యార్థులు ట్రక్కులమీదా మోటారు సైకిళ్ళపై పాటలు పాడుకొంటూ ఊరేగింపు జరిపారు. ఊరేగింపు న్యూఢిల్లీలోని బుద్ధవిహార్ నుండి ప్రారంభమై ఎర్రకోటవద్ద ముగిసింది. బహిరంగసభకూడా ఎర్రకోటవద్ద జరిగింది.

* * *

చైనా-భారత మైత్రీ సంఘం వార్షికోత్సవం

లండన్, మే 15

చైనా భారతమైత్రీ సంఘం నాల్గవ వార్షికోత్సవం సందర్భంలో నేడు పెకింగ్‌లో గొప్ప బహిరంగసభ జరిగింది. ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న భారత-చైనా మిత్రమండలి ప్రతినిధివర్గంవారు కూడా సభకు వచ్చారు.

భారతీయ అతిథులు వేదికపై కనిపించగానే "చైనా ప్రజలు, భారతీయులు సోదరులు" అంటూ ప్రజలు దిక్కులు పిక్కటిల్లేలాహర్షధ్వానాలు చేశారు.

చైనా-భారత మైత్రీసంఘం అధ్యక్షుడు టింగ్ సిలిన్ మాట్లాడుతూ, ఈ సంఘం ఏర్పడినతర్వాత గత నాలుగేండ్లలోనూ, ఉభయ దేశాల మధ్య స్నేహం దిన దిన ప్రవర్ధమానమైందన్నారు. ఈ స్నేహం ఉభయ దేశాల ప్రజల సౌభాగ్యానికి, ప్రపంచ శాంతికి తోడ్పడుతుందన్నారు.

భారత ప్రతినిధివర్గం నాయకుడు శ్రీ పి. వి. బాపట్ మాట్లాడుతూ, భారత - చైనా మైత్రి ప్రపంచ శాంతి రక్షణలో గొప్ప శక్తిగా పనిచేస్తుందన్నారు.

భారత చలన చిత్రం "ఝాన్సీ కీ రాణీ" ని సభకు హాజరైనవారికోసం ప్రత్యేకంగా ప్రదర్శించారు.

'నిర్బంధ వోటింగ్ పద్ధతి పనికిరాదు'

ప్రజా ప్రాతినిధ్యచట్టం సవరణ బిల్లుపై చర్చలో శ్రీ పటాస్కర్ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, మే 16

ప్రజా ప్రాతినిధ్యం చట్టసవరణబిల్లుపై లోక్‌సభ చర్చ సందర్భంలో న్యాయ వ్యవహారాల మంత్రి శ్రీ పటాస్కర్ మాట్లాడుతూ వోటింగును నిర్బంధం చేయకూడదన్న ప్రభుత్వ అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు.

ప్రజా ప్రాతినిధ్య చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభలో నేడు చర్చ కొనసాగింది.

న్యాయ వ్యవహారాల మంత్రి శ్రీ పటాస్కర్ చర్చకు జవాబుయిస్తూ, అభ్యర్థికోసం ఒక రాజకీయపార్టీ చేసిన ఎన్నికల ఖర్చును ఆ అభ్యర్థి ఎన్నికల ఖర్చులో చేర్చకూడదనీ, ఆ ప్రకారం ఆ పార్టీ రాజకీయ అభిప్రాయాలకోసం, విధానాలకోసం తప్పితే వ్యక్తిగతంగా అభ్యర్థులకోసం చేసినది కాదనీ అన్నారు.

నిర్బంధ వోటింగ్ పద్ధతి భారతదేశంలో అమలు చేయకూడదని ఉద్ఘాటించారు. బెల్జియం, ఆస్ట్రేలియావంటి దేశాలలో ఇది సాధ్యమైతే కావచ్చు కాని భారతదేశంవంటి విశాలదేశంలో ఇది సాధ్యం కాదని అన్నారు.

ఎన్నికల ఖర్చులకు పరిమితి నిర్ణయించినవాడు ఎన్నికల జమాఖర్చులను సమర్పించాలని నిర్ణయించడం అవసరమనీ ఇందుకు సంబంధించిన కార్యవిధానాన్ని సెలెక్టు కమిటీ సులభతరం చేసిందని అన్నారు.

బిల్లు-క్లాజువారీచర్చ సందర్భంలో శ్రీ కె. కె. బాసు (కమ్యూ), శ్రీ హెచ్. వి. కామత్ (పి. ఎస్. పి.), శ్రీఆర్ వెంకట్రామన్ (కాం) సవరణలు ప్రతిపాదిస్తూ నైతిక దుష్ప్రవర్తన గురించిన నేరాలకు శిక్షింపబడిన వారిని మాత్రమే అనర్హులుగా ప్రకటించాలని కోరారు.

శ్రీ ఠాకూర్ దాస్ భార్గవ (కాం) ఎన్నికల జమాఖర్చులను దాఖలు చేయాలన్న నిబంధనను యథాతథంగా ఉంచాలన్నారు.

శ్రీ టేక్ చంద్ (కాం) నైతిక దుష్ప్రవర్తన మాత్రమే, అభ్యర్థిగా నిలబడటానికి అనర్హతగా పరిగణించాలన్నారు.

అనర్హతలను తొలగించే అధికారం ఎన్నికల కమిషనర్‌కు యివ్వాలన్న శ్రీ ఎన్. సి. చటర్జీ సవరణను శ్రీ పటాస్కర్ ఆమోదించారు. నైతిక దుష్ప్రవర్తన అంటే ఏమిటో నిర్వచించడం కష్టమనీ అందుచేత దీనిని ఎన్నికల కమిషన్ నిర్ణయానికి వదలి పెట్టడం మంచిదని ఆయన అన్నారు.

రెండు గంటల చర్చానంతరం సాధారణ ఎన్నికల వివరాల ప్రకటన గురించిన నిబంధనలను సభవారు ఆమోదించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసన సభల ఎన్నికలకు నామినేషన్ల లెక్కింపు, ఏజంట్ల నియామకం, ఉపసంహరణలు, ఎన్నికల ఫలితాల ప్రకటన మొదలైన వివరాలకు సంబంధించినవి ఈ నిబంధనలు.

ఏ పరిస్థితులలో రిటర్నింగ్ ఆఫీసరు ఒకనియోజకవర్గంలోని పోలింగ్‌ను రద్దుచేయవచ్చునో వివరించుతూ శ్రీ కె. ఎల్. మోరే మరొకరు కలసి ప్రతిపాదించిన సవరణను సభవారు ఆమోదించారు. బ్యాలెట్ పెట్టెలను బద్దలుకొట్టడం, ఉద్దేశ్య పూర్వకంగాగాని, ప్రమాదవశాత్తుగాని ధ్వంసంచేయడం, లేదా బ్యాలెట్ పెట్టెలు చెడిపోవటంగాని సంభవించినప్పుడు పోలింగ్‌ను రద్దు చేయవచ్చు.

జమ్మూ, కాశ్మీర్ ప్రాంతాలకు ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని విస్తరింపచేయాలన్న అభ్యర్థన గురించి శ్రీ పటాస్కర్ సమాధానం చెబుతూ ప్రస్తుతానికి తమకు అట్టి అధికారం లేదన్నారు. జమ్మూ, కాశ్మీర్ ప్రభుత్వం తమ ఎన్నికలచట్టాన్ని రూపొందించి నప్పుడు ఈ బిల్లును కూడా దృష్టిలో ఉంచుకొంటుందని ఆశిస్తున్నామన్నారు.

సభ లక్ష్మివారం వరకు వాయిదా పడింది.

డోర్నకల్, కాజీపేట జంక్షన్ల రైల్వేసమ్మె

మూడు రోజులుగా కొనసాగింపు

హైదరాబాద్, మే 16

గత మూడు రోజులుగా డోర్నకల్, కాజీపేట రైల్వే జంక్షన్లలోని ఫైర్ మెన్ సమ్మె జేస్తున్నందున నేడు కూడా యీ రెండు జంక్షన్ల మీదుగా వచ్చి పోయే రైళ్ళన్నీ బందయ్యాయి.

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ మద్రాసు జనతా ఎక్స్‌ప్రెస్ రైళ్ళను నాగపూర్, రాయపూర్, వాల్తేరుమీదుగా విజయవాడ మళ్ళించారు.

కాజీపేటమీదుగా సరాసరి ఢిల్లీ మద్రాసులకు పోవడానికి వేసే పెట్టెలను వేయకుండాచేశారు. సికింద్రాబాద్ - వాడీ, సికింద్రాబాద్ మీటర్‌గేజి రైళ్ళ ప్రయాణాలు, సరకుల రవాణా యధా ప్రకారం సాగుతున్నాయి.

కేంద్ర కన్సిలియేషన్ ఉద్యోగి నేడు కాజీపేటవచ్చి సమ్మె పరిస్థితిని పరిశీలించారు. ఎలవెన్సుల విషయమై వచ్చిన వివాదం సందర్భంలో ఇక్కడ ఫైర్ మెన్ సమ్మె చేస్తున్నారు.

* * *

బర్ద్వాన్ రైల్వే లోకోషెడ్‌లో ఆకస్మిక సమ్మె

బర్ద్వాన్, (బెంగాల్) మే 16

బర్ద్వాన్ రైల్వే లోకోషెడ్‌కు చెందిన 400 మంది పనివారు నిన్న ఆకస్మికంగా సమ్మెచేశారు. ఈ సెరాంధంలో లోకో షెడ్ పనివారిని విచక్షణారహితంగా అరెస్టు చేసినందుకు నిరసనగా ఈ సమ్మె చేశారు. సాయంత్రం వీరిని జామీనుపై విడుదల చేసిన తరువాత సమ్మె విరమించారు.

* * *

ఐసెన్‌హోవర్‌తో జి. డి. బిర్లా గోష్ఠి

వాషింగ్టన్, మే 14

భారత పారిశ్రామికవేత్త శ్రీ జి. డి. బిర్లా నేడు అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్‌ని కలుసుకొని 25 నిముషాలసేపు సంభాషణలు జరిపారు.

ఆ తర్వాత పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ, శ్రీ బిర్లా ఇండియా-అమెరికాలమధ్య విభేదాలు కాలక్రమేణా తొలగిపోతాయని ఆశాభావం వెలిబుచ్చారు. విభేదాలను గురించి ఉభయ దేశాల పత్రికలు అతిగా ప్రచారం చేస్తున్నాయన్నారు.

శ్రీ బిర్లా ఇక్కడికి మూడు వారాలక్రితం వచ్చారు. ఇక్కడనుంచి లండన్ వెడుతున్నారు.

* * *

మడగాస్కర్ నుండి అయిదుగురు భారతీయులను వెళ్ళి పొమ్మన్నారు.

గుజరాత్ మంత్రివర్గ నిర్మాణంపై వార్తలు

సౌరాష్ట్ర ముఖ్యమంత్రిఖండన

రాజకోట, మే 15

నూతన గుజరాత్ రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను గురించీ, మంత్రివర్గ వివరాలను గురించి ఇటీవల కొన్ని పత్రికల్లో ప్రచురింపబడిన వార్తలకు ఎలాంటి ఆధారం లేదని తెలుపుతూ నేడు సౌరాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఆర్. యు. పరిక్ ఒక పత్రికా ప్రకటన చేశారు.

కొత్త గుజరాత్ రాష్ట్రంలో ఏర్పడబోయే ప్రభుత్వానికి ప్రస్తుత బొంబాయి ఆర్థికమంత్రి డాక్టర్ జీవరాజ్ మెహతా ముఖ్యమంత్రిగా వుండగలరనీ, సౌరాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పరిక్ కూడా ఒక మంత్రిగా వుండగలరని ఆ వార్తలో వుంది.

ఇలాంటి వార్తలవలన ప్రజల్లో దురభిప్రాయాలు ఏర్పడుతాయనీ, అందువలన ఈ వార్తను ఖండిస్తున్నానని శ్రీ పరిక్ తెలిపారు.

బొంబాయి నగర భవిష్యత్తును గురించి అభిప్రాయం చెప్పడానికి శ్రీ పరిక్ నిరాకరించుతూ ఆ సమస్యపై నిర్ణయం చేయవలసింది జాతీయ నాయకులే నన్నారు.

* * *

కృష్ణా కమ్యూనిస్టుపార్టీ ప్లీనంసమావేశం వాయిదా

విజయవాడ, మే 16

కృష్ణాజిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు గారు యిలా వ్రాస్తున్నారు

ఈ నెల 21, 22, 23 తేదీలలో కృష్ణాజిల్లా కమ్యూనిస్టుపార్టీ ప్లీనం సమావేశం జరుగుతుందని లోగడ ప్రకటించాం. కాని ఈ సమావేశం జూన్ నెల 1, 2, 3 తేదీలకు వాయిదా పడింది. ఈ తేదీ మార్పులను అందరూ గుర్తించుకోవాలని విజ్ఞప్తి.

మత్స్య పరిశ్రమపై జపాన్-సోవియట్ ఒప్పందం

మాస్కో, మే 15

సోవియట్ యూనియన్, జపాన్‌లు నేడు దీర్ఘ కాల మత్స్యపరిశ్రమ ఒప్పందాన్ని చేసుకున్నాయి. ఉభయ దేశాల మధ్య మామూలు పరిస్థితులు నెలకొన్నపుడు ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ఉభయ దేశాల మధ్య జరిగిన మొదటి ఒప్పందం ఇదే.

ఆదేసమయంలో, ఈశాన్య పసిఫిక్ సముద్రంలో చేపలు పట్టడానికి సంబంధించిన చర్యలపై జపాన్ సోవియట్ ప్రతినిధుల మధ్య జరుగుతున్న సంప్రతింపులు ముగిశాయి. ఆ సమస్యపై ఒప్పందం కుదిరింది.

మహా పంజాబు వాదుల అరెస్టు

అమృతసర్, మే 16

కొన్ని గంటలకు పూర్వం [illegible] ఆరోపణపై నేడిక్కడ [illegible] మహా పంజాబు వాదులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో అమృతసర్ జనసంఘ ప్రధాన కార్యదర్శి మంగత్ రాయ్, ఆర్. యస్. యస్. నాయకుడు [illegible] బ్రహ్మదేవ్ వున్నారు.

మరో ఆరుగురి అరెస్టుకోసం నేడు వారెంట్లు జారీచేయబడ్డాయి. వారంటు చేయబడినవారిలో మహా పంజాబు సమితి కన్వీనర్ శ్రీ లాల రామ్‌జీ దాస్ టాండన్ కూడా వున్నారు.

వీరంతా మే 12వ తేదీ రాత్రి కాంగ్రెసువారితో ఘర్షణ పడ్డారని సీనియర్ పోలీసు సూపరింటెండెంటు పత్రికలవారికి తెలిపారు.



గొంతు నొప్పి శమనానికి పెప్స్‌ను సేవించండి

PEPS

పెప్స్ గొంతు [illegible] అంటు నిరోధక బిళ్ళలు

FPY-40-TEL

సోల్ ఏజెంట్లు: దాదా & కో.,

88, పైఎమ్మా నాయక్ వీధి, మద్రాస్-3

సింగపూరు విషయమై బ్రిటిష్ ప్రభుత్వపు కరకు వలసవిధానం: ప్రధాని మార్షల్ తీవ్ర విమర్శ

లండన్, మే 16

తమ కామన్వెల్తు రక్షణకు సింగపూర్ చాల ప్రధానమైన దుర్గం కాబట్టి, దాని అంతరంగిక శాంతి భద్రతల రక్షణ విషయంలో కూడా తమకు, కాల పరిమితి లేకుండా వంతు కావాలని బ్రిటిష్ ప్రభుత్వం పట్టుపట్టడం వల్లనే సింగపూరు స్వాతంత్ర్యం గురించిన సంప్రతింపులు భగ్నమయాయని సింగపూరు ప్రధాని డేవిడ్ మార్షల్ ఈ వేళ పత్రికా విలేఖరుల సమావేశంలో వెల్లడిచేశారు.

"1959 ఏప్రిల్ వరకు బ్రిటన్ తాను కోరిన అధికారాన్నంతా చలాయించ వచ్చునని నేను ఆఖరు నిమిషంలో సూచించాను. ఆ తరువాత కూడా, సింగపూరు రాజ్యాంగ చట్టాన్ని రద్దుచేయగల హక్కు బ్రిటనుకు ఉంటుందన్నాము. బ్రిటిష్ ప్రభుత్వపు పట్టుదలకు మేము తలొగ్గాము అయినా లాభం లేకపోయింది. ఖచ్చితమైన తేదీని గడువు పెట్టడం తనకు మహా చికాకు అనిచెప్పి బ్రిటిష్ వలసశాఖ మంత్రి లెన్నాక్స్ బాయిడ్ మా సూచనలను నిరాకరించారు" అని మార్షల్ వివరించారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"సింగపూరు స్వాతంత్ర్య సంప్రతింపులు భగ్నంకావడం చాల విషఫలితాలకు దారితీయగలదు. బ్రిటిష్ వారిని తరిమి గొట్టాలి - వారిని సముద్రంలో త్రోసేయండి అనే నినాదాలకు బ్రిటిష్ ప్రభుత్వపు వైఖరి అవకాశం ఇస్తోంది.

"సింగపూరులోని ప్రజాతంత్రవాదులూ, జాతీయవాదులూ చాల నిస్పృహ పొందుతారు. బ్రిటిష్‌వారి సత్స్వభావాన్ని నమ్ముతున్న వారంతా చాల ఆశాభంగం పొందుతారు.

"కమ్యూనిజంవైపు మొగ్గిపోయే ప్రమాదం చాలా ఉంది.

"బ్రిటిష్‌వారు విజ్ఞులు, ధర్మబుద్ధి కలవారనే నమ్మకం నాకు ఈనాటికి ఉంది. అటువంటివారు మా కోరికను ఎలా నిరాకరించగలిగారో నాకేమీ అర్థంకావడంలేదు.

ఫాసిస్టు దృక్పథం

"వలసపెత్తనం అనే జాడ్యం వీరి నరనరాలకూ జీర్ణించింది. దానితో ఫాసిస్టు దృక్పథం ఏర్పడింది"

ఈ సంప్రతింపులు భగ్నం కావడంతో తన ప్రధానిపదవికి రాజీనామా నివ్వాలని చేసుకున్న నిర్ణయం సరుకులేనిదా అని విలేఖరులు అడుగగా మార్షల్ ఇలా అన్నారు

"నా నిర్ణయాన్ని మార్చుకో వలసిన కారణం ఏమీ కనబడటం లేదు. అయితే నేను రాజీనామా నివ్వడంవల్ల తిరిగి ఎన్నికలు జరుగుతాయని కాదు. ప్రతిపక్షం నాతో ఏదో ఒకవిధంగా మంత్రివర్గాన్ని ఏర్పరుస్తారు. వారు లండనులోని వలసశాఖ కీలుబొమ్మలుగా ఉంటారు.

"అయితే తుపాకులు గురిపెట్టిసింగపూరుని ఈ విధంగా చేతిక్రింద ఎన్నాళ్ళు ఉంచుకోగలమని అనుకుంటున్నారు?" అని మార్షల్ ప్రశ్నించారు.

రక్షణకన్నా స్వాతంత్ర్యమే వాంఛనీయ మనుకుంటున్నారా అని ఒక విలేఖరి అడిగాడు.

ఆవేశంతో ఎల్లదరిచి మార్షల్ ఇలా అన్నారు:

"మేము రక్షణగురించి ఆలోచించలేదు. సింగపూరుని సైనిక, నౌకా కేంద్రంగానే అట్టిపెడితే అది అణ్వాయుధ దాడికి గురికావడమూ, జాడ అయినా మిగలకుండా మాయమయి పోవడమూ తథ్యం."

బ్రిటిష్ వలసమంత్రి వ్యాఖ్య

సింగపూరు స్వాతంత్ర్య సంప్రతింపుల వైఫల్యం గురించి కామన్సు సభలో వ్యాఖ్యానిస్తూ బ్రిటిష్ వలసశాఖ మంత్రి లెన్నాక్స్ బాయిడ్ ఇలా అన్నారు:

"ఈ సంప్రతింపులలో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలు దూరదృష్టితో కూడుకున్నవి, నిర్మాణాత్మకమైనవిన్నీ. సింగపూరు ప్రతినిధివర్గంలో అధికసంఖ్యాకులు ఈ ప్రతిపాదనలను నిరాకరించినందుకు సింగపూరు ప్రజల్లో ఎక్కువ మంది విచారిస్తారనేందుకు సందేహం లేదు.

"అయితే తిరిగి సంప్రతింపులు జరిగేందుకు అవకాశాలు లేకుండా పోలేదు. సహనంతోనూ, విజ్ఞతతోనూ ఆలోచించి, బ్రిటిష్ ప్రతిపాదనలు ఎలా న్యాయమైనవో గుర్తించగలరనీ, సంప్రతింపులను తిరిగి ప్రారంభించేందుకు వీటిని ప్రాతిపదికగా స్వీకరించగలరనీ ఆశిస్తున్నాను."

ఈయన ఈ మాటలంటున్నప్పుడు ప్రముఖ ప్రేక్షకులస్థానంలో సింగపూరు ప్రధాని మార్షల్ కూర్చొని ఉన్నారు.

సింగపూరు ప్రజల ఆశయాలను సంతృప్తి పరుస్తూ, అదే సమయంలో 'స్వేచ్ఛా ప్రపంచ'పు రక్షణకు సింగపూరు ప్రాధాన్యతను కూడా లెక్కలోకి తీసుకోగల రాజ్యాంగ చట్టాన్ని రూపొందించేందుకు ఈ సంప్రతింపులలో బ్రిటిష్ ప్రభుత్వం ఎంతో ప్రయత్నించిందని బాయిడ్ తన ప్రసంగంలో చెప్పుకున్నారు.

అయితే కొన్ని ప్రత్యేక రక్షణ సంస్థలలోతప్ప ఇతరత్రా బ్రిటనుకు ఏలాంటి అధికారాలూ ఉండకూడదనీ, అంతగా అవసరమయితే రాజ్యాంగ చట్టాన్ని రద్దు చేసి, ప్రభుత్వ బాధ్యతనంతా బ్రిటనే స్వీకరించవచ్చుననీ సింగపూరు ప్రతినిధివర్గంలో ఎక్కువమంది పట్టుబట్టారని ఆయన అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదన్నారు.

సింగపూర్ తాత్కాలిక ప్రధాని వ్యాఖ్య

లండను సంప్రతింపులు భగ్నమయినప్పటికీ బాధ్యతాయుతంగా ప్రవర్తించవలసిందిగా సింగపూరు ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ తాత్కాలిక ప్రధాని చ్యూస్వీ కె ఒక రేడియో ప్రసంగం చేశారని సింగపూరువార్త.

లండను సంప్రతింపుల వైఫల్యం ప్రజలందరికీ తీవ్రమైన ఆశాభంగం కలిగించిందనీ, అయినా ఇది దేశ స్వాతంత్ర్య సాధనకు తాత్కాలికమైన అవరోధమే అనీ ఆయన అన్నారు.

* * *

అల్జీర్స్, మే 15

గత 24 గంటలలో అల్జీరియాలో ఫ్రెంచి ప్రభుత్వ సైనికులకు, అల్జీరియన్ విప్లవకారులకు జరిగిన ఘర్షణలలో సుమారు 100 మంది విప్లవకారులు మరణించినట్లు ఇక్కడికి వార్తలందాయి.

ఫ్రెంచి, సోవియట్ సంప్రతింపులు : మాస్కోలో ప్రారంభం

మాస్కో, మే 16

"ఒకరి అభిప్రాయాలు ఒకరికి తెలియడానికీ, ఒక దేశంవారు మరొక దేశానికి స్వేచ్ఛగా ప్రయాణం చేయడానికీ ఉన్న అవరోధాలన్నీ తొలగిపోవాలని అభిలషిస్తున్నాను" అని ఫ్రెంచి ప్రధాని మైమోలె నేడు క్రెమ్లిన్‌లో జరిగిన ఒక విందులో టోస్టు ఇస్తూ అన్నారు.

నిన్న మాస్కోవచ్చిన మైమోలె, ఫ్రెంచి విదేశాంగ మంత్రి క్రిస్టియన్ పినేలకు గౌరవార్థం సోవియట్ ప్రధాని బుల్గానిన్ నేడు ఈ విందు జరిపారు.

ఈ విందు జరగడానికి ముందు ఫ్రెంచి మంత్రులూ, బుల్గానిన్, కృశ్చేవ్, మొలటోవ్‌లు రెండున్నర గంటలసేపు సంభాషణలు జరిపారు. ఈ సంభాషణలు క్రెమ్లిన్‌లోని సోవియట్ ప్రభుత్వ కార్యాలయంలో జరిగాయి.

"నిరాయుధీకరణ సమస్యపై ఒకరి అభిప్రాయాలను ఒకరికి దాపరికం లేకుండా తెలుపుకున్నారు. ఇతర సమస్యలను స్థూలంగా సింహావలోకనం చేశాం" అని సంభాషణల అనంతరం ఒక ప్రకటన వెలువడింది.

నేటి సంభాషణల్లో నిరాయుధీకరణ సమస్యనుగురించి 'అంతా నవ్వుతూనూ, తీవ్రవాదోపవాదాలు లేకుండానూ' చర్చించారని ఫ్రెంచి వర్గాల వారు తెలిపారు.

జర్మనీ సమస్య కూడా ఈ సంభాషణలలోనే చర్చకు వచ్చిందన్నారు. ఈ రెండు సమస్యలపైనా తమ దృక్పథాన్ని సోవియట్ వారు చాల పట్టుదలతోనే వ్యక్తం చేశారన్నారు. జర్మనీ ఏకీకరణకు నిరాయుధీకరణ సమస్యకు ముడిపెట్టరాదన్నది సోవియట్ వైఖరి. జర్మనీ సమస్యా, ఇతర రాజకీయ సమస్యలూ పరిష్కారం కానిదే నిరాయుధీకరణ సమస్యా పరిష్కారం అసంభవం అన్నది పశ్చిమరాజ్యాల వాదన.

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త — కాట్రగడ్డ రాజగోపాలరావు—ముద్రణ స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, బకింగ్‌హాం పేట, విజయవాడ. సంపాదకవర్గం.— మోటూరు హనుమంతరావు, [అధ్యక్షులు] కంభంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు.